



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 236 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ సోమవారం 18 మే 2026 పేజీలు : 12 వెల : 2/-




## పర్యాటకంలో రాష్ట్ర ప్రగతి... పురోగతి

- పర్యాటకాభివృద్ధితో 1.22 లక్షల మందికి ఉద్యోగ-ఉపాధి అవకాశాలు
- టూరిజానికి పారిశ్రామిక హోదాతో ఏపీకి తరలి వస్తున్న ప్రాజెక్టులు
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా పర్యాటకాభివృద్ధికి రోడ్ మ్యాప్
- హోటళ్లు, హోం స్టేలు, థీమ్ పార్కులు, కారవాన్ టూరిజంలతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు
- అన్ని ఇజంల కంటే టూరిజం బెస్ట్ అనే థియరితో టూరిజం అభివృద్ధికి ముఖ్యమంత్రి మార్గనిర్దేశం
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక సూచనలతో పర్యాటకాభివృద్ధికి మెరుగైన చర్యలు
- రెండేళ్ల కూటమి పాలనలో టూరిజంలో విప్లవాత్మక సంస్కరణలు... పర్యాటకాభివృద్ధి దిశగా ఏపీ అడుగులు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు... పర్యాటక రంగంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి జరిగేలా రోడ్ మ్యాప్ ఏర్పాటు చేసుకుని కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల కాలంలో పని చేసింది. టూరిజం అభివృద్ధితో రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేలా... యువతకు ఉద్యోగ-ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా పక్కా ప్రణాళికతో టూరిజం శాఖ వ్యవహరిస్తోంది. అన్ని ఇజంలు పక్కకు పోతాయని... టూరిజమే మిగులుతుందనే మాటను వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతూ ఉంటారు. ఇదే థియరితో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదే సమయంలో పవన్ కళ్యాణ్ మిగతా .. 2లో..

## తుపాను వచ్చే ముందు..

### ఏఐ ఫొటోతో ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో 'తుపాను వచ్చే ముందు ప్రశాంతంగానే ఉంటుంది' అంటూ ఓ ఏఐ ఫొటోతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌పై వైమానిక దాడులను పునఃప్రారంభించడంపై ట్రంప్ తన యంత్రాంగంతో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన హెచ్చరికలు చేయడం గమనార్హం. ఏఐతో రూపొందించిన ఫొటోను ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఆ ఫొటోలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో యుద్ధనౌకలు ప్రయాణిస్తున్నాయి. అక్కడే ట్రంప్,

### ఎబోలా వ్యాప్తి..

## హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యుహెచ్‌వో



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాణాంతక ఎబోలా వైరస్‌తో ఆఫ్రికా ఖండంలోని కాంగోలో 88మంది ప్రాణాలు కోల్పోగా... మరో 300మంది ఈ వైరస్ బారిన పడినట్లు మిగతా .. 2లో..

### అమరావతిలో క్వాంటం-సెక్యూర్ టెస్ట్ బెడ్..

## దేశంలోనే తొలిసారి


**ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా పరిశోధనలు - సైబర్ రక్షణ పరిష్కారాలకు కేంద్రంగా అమరావతి**
**మేకిన్ ఇండియా సాంకేతికతలకు ఈ ప్రాజెక్టుతో ఊతం : సీఎం చంద్రబాబు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలోనే తొలి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్ అమరావతిలో ఏర్పాటు కానుంది. ఈ సరికొత్త ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదికగా ఈ విషయాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సి-డాట్, అమరావతి క్వాంటం వ్యాలీ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. అమరావతిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఈ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్లకు అమరావతి ఇకపై కేంద్ర బిందువుగా మారుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. సురక్షితమైన సమాచార మార్పిడి, నమ్మకమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు దేశ భవిష్యత్తుకు ఎంతో కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభమైనప్పటి నుంచి ఏపీలో కీలక అడుగులు పడుతున్నాయి. టెలికమ్యూనికేషన్, ఐటీ, క్వాంటం రంగాల్లో అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త టెస్ట్ బెడ్ క్వాంటం మిగతా .. 2లో..

### వితంతువులకు శుభవార్త..

## జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు మిగతా .. 2లో..

### సమాజానికి సేవ చేయాలనే బలమైన ఆలోచనతో

## 'ఐక్య ధైర్య సేన సమితి'

**సేవా భావం ఉన్నవారందరినీ ఒకే వేదికపైకి తేవడమే లక్ష్యమన్న మనోజ్**
**మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై కూడా దృష్టి సారిస్తామన్న మౌనిక**
**ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరించిన మనోజ్ దంపతులు**
**కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజానికి సేవ చేయాలనే బలమైన ఆలోచన ఉన్న ప్రతీ ఒక్కరినీ ఒకే గొడుగు కిందకు తేవాలనే గొప్ప లక్ష్యంతోనే ఐక్య సంస్థను ప్రారంభించినట్టు నటుడు 'రా కింగ్' మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక భూమా వెల్లడించారు. తన పుట్టినరోజు నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో "ఐక్య ధైర్య సేన సమితి" అనే తమ సామాజిక సేవా సంస్థను మనోజ్ అధికారికంగా ఆవిష్కరించారు. సేవా భావం ఉన్నవారందరికీ ఒక వేదికను అందించాలనేదే తమ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం గురించి మనోజ్ భావోద్వేగంగా మాట్లాడుతూ, "సమాజానికి అండగా మిగతా .. 2లో..

### తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలపై

## భారీ టోల్ విధింపునకు టీటీడీ యోచన

**ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యం**



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ప్రోత్సాహం కల్పించడంతో పాటు, అలిపిరి వద్దే రూ.500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు టీటీడీ ఈవో ఎం.రవిచంద్ర కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు సగటున 8,000 మిగతా .. 2లో..

### ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో

## నిప్పుల వర్షమే!

**తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక**
**మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు**
**45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం**

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచి కొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని మిగతా .. 2లో..

### నరసరావుపేట డీఎస్పీకి

## పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

**అట్రాసిటీ కేసులో హైకోర్టు షరతులతో కూడిన ఆదేశం**
**విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**
**ఇప్పటికే ఏసీబీ కేసుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి**



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజని తన పాస్‌పోర్ట్‌ను నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో అప్పగించారు. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు విధించిన షరతుల మేరకు ఆమె ఈ చర్య తీసుకున్నారు. ఆదివారం ఆమె డీఎస్పీ కార్యాలయానికి వచ్చి పాస్‌పోర్ట్‌ను పోలీసులకు మిగతా .. 2లో..

### యూట్యూబ్ ఛానల్


## ప్రారంభించిన నారా దేవాన్ష్

**'Dino Deets' పేరుతో పాడ్‌కాస్ట్‌లు**
**డైనోసార్లు, శిలాజాల గురించి ఆసక్తికర విషయాలు**
**నారా కుటుంబ సభ్యుల అభినందనలు - శుక్రవారం తొలి ఎపిసోడ్**




**విశ్వం వాయిస్ న్యూస్ :** మంత్రి నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ 'Dino Deets' పేరుతో కొత్త యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. ఈ సరికొత్త డిజిటల్ ప్రయాణంపై నారా, నందమూరి కుటుంబసభ్యులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఛానల్‌కు సంబంధించిన ప్రమోషనల్ టీజర్‌లో మంత్రి నారా లోకేశ్ కూడా కొడుకుతో కలిసి సందడి చేశారు. ఈ ప్రమోషనల్ వీడియోలో దేవాన్ష్ ప్రారంభించబోతున్న పాడ్‌కాస్ట్ ప్రత్యేకతలను లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. డైనోసార్లు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించిన ఆశ్చర్యకరమైన విషయాలను ఈ ఛానల్ ద్వారా దేవాన్ష్ పంచుకోనున్నాడు. నారా దేవాన్ష్ యూట్యూబ్ మిగతా .. 2లో..

## ఏపీ హైకోర్టు సీజేకు జడ్ ప్లస్ భద్రత.. గ్రీన్ ఛానల్ ఏర్పాటుకు ఆదేశాలు



**సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వ నిర్ణయం - సీజే కాన్వాయ్‌కు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు**
**విజయవాడ, గుంటూరు పోలీసులకు డీజీపీ నుంచి కీలక సూచనలు**

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లీసా గిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచింది. ఆమెకు 'జడ్ ప్లస్' కేటగిరీ భద్రత కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ లీసా గిల్‌కు ముప్పు పొంచి ఉందన్న అంచనాలు, సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# పర్యాటకంతో రాష్ట్ర ప్రగతి... పురోగతి

టూరిజం అభివృద్ధికి విలువైన సలహాలు ఇస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు... ఆధ్యాత్మిక కేంద్రాలు... దేవాలయాలు ఉన్నాయి. వీటిని ఇంటిగ్రేట్ చేయడం.. ప్రాచుర్యం కల్పించడం.. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ముందుకు వస్తున్నాయి. అందర్నీ ఆకట్టుకునేలా టూరిజం పాలసీ 2024--29ని ప్రభుత్వం రూపొందించారు. రాబోయే ఐదేళ్ల కాలానికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌తో సరికొత్త పర్యాటక విధానాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యం. దీంతోపాటు... పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించి.. ఇన్వెస్టర్లకు క్యాపిటల్ సబ్సిడీలు, ా+ూ రీయింబర్స్‌మెంట్, స్టాంప్ డ్యూటీ మినహాయింపు వంటి రాయితీలను అందించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. దేశంలో తొలిసారిగా టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025ను ప్రవేశపెట్టి పారదర్శక పద్ధతిలో భూ కేటాయింపులు చేస్తూ భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేశారు. అదే విధంగా క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే, బిడబి (దీడదీ) విధానాల ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు.

**లక్ష్యాలను నిర్దేశించుకుని...**

రాష్ట్రంలో 50,000 క్లాసిఫైడ్ గదుల ఏర్పాటు, పెద్ద ఎత్తున పెట్టుబడులు, 10,000 హోమ్ స్టేలు, 20 శాతం జీవీఏ సాధన, 12 శాతం నుంచి 15 శాతం ఉద్యోగాల కల్పన తద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పర్యాటక శాఖ ముందుకు సాగుతోంది. రాష్ట్రాల్లో ఏపీని అగ్రపథాన నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ముందుకు సాగుతుంది. పర్యాటకాభివృద్ధి ద్వారా రాష్ట్ర తలసరి ఆదాయానికి పర్యాటక శాఖ నుండి ఆర్థిక సహకారం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

**ఏపీకి క్యూ కట్టిన అంతర్జాతీయ బ్రాండ్లు**

ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెద్ద ఎత్తున వచ్చాయి. రెండేళ్ల కాలంలో రూ. 20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ముందుకు వచ్చాయి. అలాగే 117 ఎంఓయూలు కుదుర్చుకోగా, వీటి ద్వారా 1,22,637 మందికి ఉపాధి లభించనుంది. ఇక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న వివిధ హోటళ్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి, ప్రాజెక్టులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. తాజ్, మారియట్, ఐటీసీ, హయత్, ఒబెరాయ్, మేఫెర్, హిల్టన్ వంటి 14 అంతర్జాతీయ బ్రాండ్లు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా కొత్తగా 7,770 హోటల్ గదులు అందుబాటులోకి రానున్నాయి. MICE (సమావేశాలు, ప్రదర్శనలు) కేంద్రంగా అమరావతి, విశాఖపట్నం, తిరుపతి నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

**మల్టీ-ఎక్స్పీరియన్స్ టూరిజం గ్రిడ్... పర్యాటక సర్క్యూట్లు**

రాష్ట్రాన్ని ఒక సమగ్ర పర్యాటక గ్రిడ్‌గా మారుస్తూ విశాఖ, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలలో 7 యాంకర్ హబ్‌లు, 25కు పైగా ప్రత్యేక సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నారు. కార్డెలియా సంస్థ ద్వారా విలాసవంతమైన క్రూయిజ్ ప్రయాణాలు, టైడా వద్ద లగ్జరీ టెంట్ సిటీలు, ఈజ్ మై ట్రిప్ సహకారంతో హెలీ టూరిజం, లక్స్ క్యారవాన్స్ ద్వారా క్యారవాన్ పర్యాటకం, అరకు లోయలు, లంబసింగి, గండికోట వంటి గ్రీన్ రిసార్టులు, కారవాన్ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఇక నదులపై తేలియాడే హౌస్ బోట్లను రాష్ట్ర పర్యాటకంలో ప్రవేశపెట్టారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాంతాలలో దాదాపు 30 రకాల వినూత్న కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. త్వరలో మరో 21 ప్రాంతాలలో 100కు పైగా కొత్త పర్యాటక అంశాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సూర్యలంకలో హౌస్ బోట్లు విజయవంతంగా నడుస్తున్నాయి. ఇటీవలే వాటర్ స్పోర్ట్స్ కూడా ప్రారంభమయ్యాయి. వచ్చే 3 నెలల్లో భవానీ ఐలాండ్, సరస్వతీ ఘాట్, పుష్కర్ ఘాట్, గండికోటలో కూడా ఇవి పర్యాటకులను అలరించనున్నాయి. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ యాక్టివిటీస్ అందుబాటులోకి వచ్చాయి. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, బౌద్ధ సర్క్యూట్లు అందమైన బీచ్‌లు, స్వచ్ఛమైన నదీ తీరాలు, క్రూయిజ్ పర్యాటకం, ఎకో-టూరిజం, సాహసోపేతమైన సీప్లేన్ సర్క్యూట్లు పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇస్తున్నాయి. వీటన్నింటి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఒక 'మల్టీ-ఎక్స్పీరియన్స్ టూరిజం గ్రిడ్'గా మార్చింది కూటమి ప్రభుత్వం. అంతేగాక పర్యాటకుల భద్రత కోసం ప్రత్యేక బీచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిద్ధమవుతోంది.

**వెల్లివిరుస్తోన్న సాంస్కృతిక వైభవం**

తిరుమల, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, అంతర్వేది, సింహాచలం, రాయలసీమ ఆధ్యాత్మిక క్షేత్రాలను అనుసంధానిస్తూ భక్తులకు మెరుగైన రవాణా, వసతి సౌకర్యాలు కల్పించారు. ూఅతీదీఅదీ, మీఘనవవీమతీఅజూ, దీశీశీనిఅఅస్త్ర.ఎశీఎ, క్ఘుఎ ఎఅర్ఘు, ఎశీఎవర్ఘుఎ దీబఎఎఎ, ఎశీఎవఎఎబం వంటి సంస్థల భాగస్వామ్యంతో 1,855 హోమ్‌స్టేలను అనుసంధానించారు. ప్రత్యేకంగా 'ఏపీ హోమ్‌స్టే పోర్టల్'ను అందుబాటులోకి తెచ్చారు. విజయవాడ ఉత్సవ్, గండికోట, అనకాపల్లి, విశాఖ ఉత్సవ్, అరకు చలి ఉత్సవ్, అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్, ఫ్లెమింగో ఫెస్టివల్, మసులా బీచ్ ఫెస్టివల్ వంటి వాటితో ఆయా ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రచారం లభిస్తోంది. ఫెస్టివల్ల నిర్వహణ ద్వారా స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి లభించింది. బెజవాడ ఉత్సవ్ నిర్వహణతో ఏపీలోని వివిధ కళారూపాలకు పెద్ద ఎత్తున ప్రాచుర్యం లభించింది. పురాతన కాలం నుంచి కోనసీమ ప్రాంతంలో జరిగే జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి స్టేట్ ఫెస్టివల్ గా గుర్తింపు ఇవ్వడంతో మంచి ప్రచారం లభించింది... లక్షలాది మంది పర్యాటకులు జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి తరలి వచ్చారు. యోగాంధ్ర, ప్రపంచ పర్యాటక దినోత్సవం, శ్రీ సాయిబాబా 100వ జయంతి వేడుకలు, కృష్ణవేణి సంగీత నీరాజనం, ఏపీ ట్రావెల్ మార్ట్ తదితర 10 ప్రధాన ఉత్సవాల ద్వారా ఏడాదంతా పర్యాటక శోభ ఉండేలా చర్యలు తీసుకున్నారు. సుమారు 15 లక్షల మంది పర్యాటకులు వాటిలో పాల్గొన్నారన్నది అంచనా. టూరిజం అభివృద్ధిలో భాగంగా 8 జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు సుమారు 11 లక్షల మంది హాజరయ్యారు.

**జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు**

ఏపీలోని పర్యాటక క్షేత్రాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు నీతి ఆయోగ్ గుర్తింపు లభించింది. పర్యాటకానికి సంబంధించి నీతి ఆయోగ్ ప్రచురించిన పుస్తకంలో ఏపీ పర్యాటకానికి సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇక సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టేందుకు పర్యాటక శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫాంస్ ద్వారా చేసిన ప్రచారాలతో 90 లక్షల మంది నెటిజన్లను రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు ఆకట్టుకున్నాయి. ఇప్పటివరకు ఏపీ అందాలను చాటిచెప్పే 110 షార్ట్ వీడియోలు మరియు రీల్స్‌ను రూపొందించారు. దేశంలోనే తొలిసారిగా రాపిడో భాగస్వామ్యంతో పర్యాటకులకు సరైన సమాచారం అందించేందుకు ఆటో/టాక్సీ డ్రైవర్లకు ప్రత్యేకంగా 'డ్రైవర్-కమ్-గైడ్' శిక్షణను ఇచ్చారు. కొండపల్లి టాయ్స్ ఫెస్టివల్ వంటి స్థానిక కళలను, లేపాక్షి వైభవాన్ని గ్లోబల్ ప్లాట్‌ఫామ్స్ పై ప్రదర్శించి వారసత్వాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు రాష్ట్ర పర్యాటక శాఖ 30 జాతీయ మరియు 3 అంతర్జాతీయ పర్యాటక ప్రదర్శనలలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ అందాలను ప్రపంచానికి చాటిచెప్పింది. అంతర్జాతీయ వేదికలపై ఏపీ పర్యాటక సొబగులను వినూత్నంగా ప్రదర్శించడం ద్వారా పర్యాటకుల సంఖ్యను భారీగా పెరిగింది.

**ప్రపంచ వేదికలపై ఏపీ పర్యాటక వాణి**

మంత్రి దుర్గేష్ వివిధ దేశాల్లో పర్యటించి ఏపీ పర్యాటకం గురించి వివరించారు... ఏపీలోని టూరిజం అభివృద్ధికి ఉన్న అంశాలను ప్రజెంట్ చేశారు. జర్మనీలో జరిగిన ఐటీబీ బెర్లిన్-2025 సదస్సులో పాల్గొని, వరల్డ్ మీడియా కాన్ఫరెన్స్ ద్వారా ఏపీలోని మడ అడవులు, సుదీర్ఘ సముద్ర తీరం, చారిత్రాత్మక కోటలు, బౌద్ధారామాల విశిష్టతను ప్రపంచానికి వివరించారు. వియత్నాం టూరిజం కాంక్లేవ్, సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ ఎగ్జిబిషన్, న్యూఢిల్లీ, ముంబయి, బెంగుళూరు, రాజస్థాన్, చెన్నై తదితర పలు వేదికలపై ఏపీ పర్యాటక విధివిధానాలను మంత్రి చాటి చెప్పారు.

**కేంద్ర ప్రభుత్వ సహకారం - మౌలిక వసతుల కల్పన**

రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కోసం కేంద్రం నుంచి 8 పర్యాటక ప్రాజెక్టులకు రూ. 428 కోట్ల నిధులు ఇచ్చారు. స్వదేశీ దర్శన్ 2.0 క్రింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ. 97.52 కోట్లు, బొర్రా గుహలకు రూ. 29.87 కోట్లు, సాస్కి క్రింద అఖండ గోదావరి పునరుద్ధరణకు రూ. 94.44 కోట్లు, గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, ప్రసాద్ స్కీమ్ కింద అన్నవరం దేవస్థానానికి రూ. 25.32 కోట్లు, సింహాచలంకు రూ. 54.04 కోట్లు, అదే విధంగా సీబీడీడీ క్రింద అహోబిలం స్పిరిచువల్ ఒడిస్సీకి రూ. 24.96 కోట్లు, నాగార్జున సాగర్ బౌద్ధ సర్క్యూట్‌కు రూ. 25 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ జూలై 2026 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది.

**పెరిగిన పర్యాటకుల సంఖ్య**

గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం టూరిజం అభివృద్ధికి తీసుకున్న చర్యలతో పర్యాటకుల సంఖ్య పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే పర్యాటకుల సంఖ్యలో 10.10% వృద్ధి నమోదు కాగా, విదేశీ పర్యాటకుల సంఖ్య 126.87% మేర పెరిగింది. పెట్టుబడుల వెల్లువ మరియు పర్యాటక ప్రాంతాల విస్తరణ వల్ల స్థానిక యువతకు హోటల్ మేనేజ్మెంట్, గైడ్స్, ట్రావెల్స్, మరియు హ్యాండీక్రాఫ్ట్స్ రంగాలలో పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించాయి.

**ఏపీ టూరిజానికి అవార్డులు...**

ఏపీ టూరిజానికి, ఇక్కడ తీసుకుంటున్న అభివృద్ధి చర్యలకు గుర్తింపు లభిస్తోంది. దక్షిణాదిలో అతి పెద్ద ట్రావెల్, ట్రేడ్ ఎక్స్ పో అయిన గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ -2026 సంస్థ పర్యాటకం, సంస్కృతి, వారసత్వ సంపద, టూరిజం డెస్టినేషన్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఏపీని ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రంగా ఎంపిక చేసింది. ఇక జూన్ 4న కేరళలోని తిరువనంతపురంలో మంత్రి కందుల దుర్గేష్ ఈ అవార్డును అందుకోబోతున్నారు.

**సరికొత్త ఆలోచనలతో రండి... పెట్టుబడులు పెట్టండి: మంత్రి కందుల దుర్గేష్**

ఆంధ్రప్రదేశ్ ప్రకృతి ప్రసాదించిన నందనవనమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంతో... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రోత్సాహంతో 2 ఏళ్లల్లో పర్యాటక శాఖను అభివృద్ధి బాట పట్టించామన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అత్యంత అనుకూలమైన సమయమిదే అని చెప్పారు. సరికొత్త ఆలోచనలతో రండి, పెట్టుబడులు పెట్టండి అని పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నామని మంత్రి దుర్గేష్ చెప్పారు. అన్ని విధాలా అండగా నిలిచి, పెట్టుబడులకు పూర్తి భరోసా కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి హామీ ఇస్తున్నారు.

# దేశంలోనే తొలిసారి

కమ్యూనికేషన్ హార్డ్‌వేర్, ఆప్టికల్ సిస్టమ్స్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడనుంది. దీనివల్ల మేక్ ఇన్ ఇండియా టెక్నాలజీలకు ఊతం లభించడంతో పాటు అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కుతుంది. డీప్-టెక్ ఆవిష్కరణలకు ఏపీ రాజధాని కీలక కేంద్రంగా మారబోతోంది. ప్రపంచ భవిష్యత్తును మార్చే సాంకేతికతలను రూపొందించడంలో ఏపీ విద్యార్థులు, స్టార్టప్‌లు భాగస్వాములు కావడానికి ఇది మంచి అవకాశమని చంద్రబాబు అన్నారు. ఈ అద్భుతమైన ప్రాజెక్టు కోసం శ్రమిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. ఇందులో భాగస్వాములైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ఆవిష్కర్తలకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు

అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# భారీ టోల్ విధింపునకు టీటీడీ యోచన

వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందని రవిచంద్ర తెలిపారు. దీన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధించనున్నారు. అయితే, ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రాదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చి, వాటి కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికలో మరో కీలకమైన అంశం అలిపిరి వద్ద రూ.500 కోట్ల వ్యయంతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. "దీన్ని తిరుమల కొండ దిగువ భాగంలో అభివృద్ధి చేస్తాం" అని ఈవో తెలిపారు. భక్తులు ఇక్కడే తమ మొక్కులు తీర్చుకుని, ఆ తర్వాత దర్శనం కోసం కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు, తిరుమలను కఠినంగా 'సైలెన్స్ జోన్'గా అమలు చేసి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.100 కోట్లతో అన్నదానం వంటశాలను ఆధునికీకరించడం, క్యూలైన్లకు బదులు భక్తులను నేరుగా అన్నదానం హాల్స్‌కు పంపడం వంటి చర్యలు కూడా చేపట్టనున్నారు. ఈ సంస్కరణల ద్వారా భక్తులను నిరుత్సాహపరచడం కాదని, వారి దర్శనాన్ని మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చడమే తమ ఉద్దేశమని ఈవో రవిచంద్ర వివరించారు.

# నిప్పుల వర్షమే!

అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

**నరసరావుపేట డీఎస్పీకి**

# పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

అందజేశారు. వివరాల్లోకి వెళితే, చిలకలూరిపేటకు చెందిన టీడీపీ నేత పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యడ్లపాడు పోలీసులు విడదల రజిని, ఆమె అనుచరులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు రజిని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆమె విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్‌ను తక్షణం పోలీసులకు అప్పగించాలని షరతులతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను పాటిస్తూ, విడదల రజిని తన న్యాయవాదులతో కలిసి నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావును కలిశారు. పాస్‌పోర్ట్‌ను ఆయనకు అందజేసి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత విడదల రజిని వరుస కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి రూ. 2.20 కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఆమె మరిది విడదల గోపిని అధికారులు అరెస్టు కూడా చేశారు.

**యూట్యూబ్ ఛానల్**

# ప్రారంభించిన నారా దేవాన్ష్

ఎంట్రీపై తల్లి నారా బ్రహ్మణి సోషల్ మీడియాలో స్పందించారు. శిలాజాలతో నిండిన గది నుంచి దేవాన్ష్ మైక్ ముందుకు రావడం ఎంతో గర్వంగా ఉందని బ్రహ్మణి పేర్కొన్నారు. తమ చిన్నారి క్రియేటర్ లాంచ్ చేస్తున్న పాడ్‌కాస్ట్‌ను చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఛానల్ మొదటి ఎపిసోడ్ శుక్రవారం విడుదల కానున్నట్లు వెల్లడించారు. మరోవైపు నానమ్మ నారా భువనేశ్వరి కూడా మనవడి కొత్త ప్రయత్నాన్ని అభినందించారు. చిన్నారి దేవాన్ష్ ఇలా పాడ్‌కాస్ట్ రంగంలోకి అడుగుపెట్టడం చూసి తాను ఆశ్చర్యంతో పాటు ఎంతో ఉద్వేగానికి లోనయ్యానని చెప్పారు. తనకు ఇష్టమైన డైనోసార్ల టాపిక్‌ను దేవాన్ష్ ఎంతో ఆత్మవిశ్వాసంతో వివరిస్తుంటే తన హృదయం గర్వంతో నిండిపోయిందని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ విషయాలపై తండ్రి నారా లోకేశ్ కూడా సోషల్ మీడియాలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ రోజు ఉదయం నిద్ర లేవగానే తనకు కాస్త గందరగోళం కలిగిందని లోకేశ్ పేర్కొన్నారు. గది నిండా డైనోసార్ పుస్తకాలు, డైనోసార్ పెయింటింగ్స్, బొమ్మలు కనిపించడంతో అసలు ఏం జరుగుతుందో అర్థం కాలేదన్నారు. ఆ తర్వాతే డైనోసార్లపై దేవాన్ష్ సొంతంగా పాడ్‌కాస్ట్ చేస్తున్న విషయాన్ని తనకు చెప్పాడని వివరించారు. పిల్లలు ఎప్పుడూ ఊహించని విధంగా సర్‌ప్రైజ్ ఇస్తుంటారని సంతోషం వ్యక్తం చేశారు. దేవాన్ష్ సృష్టించిన ఈ ప్రాచీన ప్రపంచంలోకి ఒక ప్రేక్షకుడిలా ప్రవేశించేందుకు ఆసక్తిగా ఉన్నానని చెప్పారు.

# గ్రీన్ ఛానల్ ఏర్పాటుకు ఆదేశాలు

రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆయన విజయవాడ, గుంటూరు పోలీసు కమిషనరేట్ల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. రోజూ విజయవాడలోని తన నివాసం నుంచి అమరావతిలోని హైకోర్టుకు ప్రయాణించే మార్గంలో జస్టిస్ లీసా గిల్ కాన్వాయ్‌కు 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు చేయాలని డీజీపీ ఆదేశించారు. దీనివల్ల ఆమె ప్రయాణ సమయంలో కాన్వాయ్ ఎక్కడా ఆగకుండా నేరుగా గమ్యస్థానానికి చేరుకుంటుంది. జస్టిస్ లీసా గిల్ 2026 ఏప్రిల్ 25న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించారు

# తుపాను వచ్చే ముందు..

ఆయన పక్కన ఒక యూఎస్ నేవీ అడ్మిరల్ నిలబడి ఉన్నారు. ఆ సముద్రంలో ఉన్న నౌకలపై ఇరాన్ జెండాలు ఉండటం గమనార్హం. దీనికి తుపానకు ముందు ప్రశాంతంగానే ఉంటుందని అర్థం వచ్చేలా క్యాప్షన్ పెట్టారు. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. హర్మూజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో దాడులు పునఃప్రారంభించడంపై ఆయన చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తుండగా.. ఆయన ఈ ఫొటో పంచుకోవడం ఆందోళనలను పెంచుతోంది.

**క్లిష్ట పరిస్థితులు తప్పవు..**

ఇక ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ నేరుగా ఇరాన్‌ను హెచ్చరించారు. టెహ్రాన్ త్వరగా ఒక ఒప్పందానికి రావాలని లేదంటే.. క్లిష్ట పరిస్థితులు తప్పవన్నారు. ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదురుతుందా లేదా అనే విషయాన్ని తాను ఇప్పుడే చెప్పలేనని పేర్కొన్నారు. తమతో డీల్ కుదుర్చుకునేందుకు వారు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు.

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యుహెచ్‌వో

స్థానిక అధికారులు వెల్లడించారు. కాంగో పొరుగు దేశమైన ఉగాండాలో కూడా వైరస్ ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. దీనివల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా.. కాంగో పొరుగు దేశాల్లో వేగంగా వ్యాపించే ప్రమాదముందని హెచ్చరించింది. ఇతర దేశాల్లో ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు తెలిపింది. 1976లో కాంగోలో ఎబోలాను తొలిసారిగా గుర్తించినప్పటి నుంచి ఇది 17వ సారి వ్యాప్తి చెందడమని వెల్లడించింది. ప్రాథమిక నమూనాలలో అధిక పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళనకరంగా మారిందని పేర్కొంది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా అమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడం వల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. జాతీయ విపత్తు అత్యవసర నిర్వహణ యంత్రాంగాలను క్రియాశీలం చేయాలని, సరిహద్దుల వెంబడి స్క్రీనింగ్ చేపట్టాలని ప్రపంచ దేశాలకు సూచించింది. అదే సమయంలో వైరస్ భయంతో సరిహద్దులను మూసివేయవద్దని.. ప్రయాణ, వాణిజ్య ఆంక్షలు విధించవద్దని కోరింది. వైరస్ లక్షణాలు ఉన్నవారు ఇతర దేశాలకు వెళ్లొద్దని పేర్కొంది. వ్యాధి నిర్ధరణ అయిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి.. వారితో సంబంధం ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని కాంగో ప్రభుత్వానికి సూచించింది.

# 'ఐక్య ధైర్య సేన సమితి'

నిలబడటం నేను, నా భార్య మౌనిక మా పెద్దల నుంచి నేర్చుకున్నాం. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినా, ఒకే ఆలోచన ఉన్న వారందరి కోసం ఒక వేదిక ఉండాలనిపించింది. ఈ ఆలోచన నిజానికి నా భార్య మౌనికది. ఆమె స్ఫూర్తితోనే ఈ సంస్థను ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఎవరికి నిజమైన సహాయం అందినా అదే మాకు గొప్ప విజయం" అని తెలిపారు. ఈ రోజు నుంచే ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరిస్తున్నామని, ఈ సేవలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ గ్రామానికి విస్తరిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం మౌనిక భూమా మంచు మాట్లాడుతూ, "మంచి ఉద్దేశంతో నేను, మనోజ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది మా తల్లిదండ్రుల ఆశీర్వాదాల వల్లే సాధ్యమైంది. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానంతో పాటు మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతాం. 'నమస్తే వరల్డ్' సంస్థ ద్వారా టాయ్ మేకింగ్ వంటి కోర్సులతో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, "ఐక్య ధైర్య సేన సమితి" పేరును అధికారికంగా ప్రకటించారు. మనోజ్ కుటుంబంతో తమకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, చిన్నప్పటి నుంచే మనోజ్‌లో సేవా భావం ఉందని కొనియాడారు. మౌనిక ఆలోచనతో పుట్టినరోజున ఈ ట్రస్ట్ ప్రారంభించడం అభినందనీయమని, ఈ కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకవైపు 'డేవిడ్ రెడ్డి' వంటి భారీ చిత్రాలతో నటుడిగా బిజీగా ఉంటూనే, మరోవైపు 'ఐక్య ధైర్య సేన సమితి' ద్వారా సమాజ సేవకు అంకితం కావడం పట్ల మనోజ్ దంపతులపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సినిమాలు, సమాజ సేవ అనే రెండు మార్గాల్లో మనోజ్ తన ప్రయాణాన్ని బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## 'కాఫీ' కబుర్లు కావు.. టీడీపీ భవిష్యత్ వ్యూహాలు..!

టీడీపీ నాయకత్వం పార్టీ నాయకులకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు.. శిక్షణ శిబిరాలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌లు.. -కాఫీ కబుర్లు- పేరు తో కూడా ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేశారు. ఈ కార్యక్రమం ఈ ఇద్దరు నాయకులకు మాత్రమే పరిమితం చేశారు. శిక్షణ సమయంలోనే వీరిద్దరు కూడా నాయకులకు చేరువై.. కాఫీ కబుర్లు పేరుతో కార్యకర్తలకు - నాయకులకు కూడా దిశానిర్దేశం చేశారు.

అయితే.. కొందరు ఈ కార్యక్రమాన్ని లైట్ తీసుకుంటున్నట్టు పార్టీకి సమాచారం అందింది. దీంతో కాఫీ కబుర్లు కార్యక్రమానికి సంబంధించి నారా లోకేష్ మరోసారి కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కాఫీ కబుర్లు కావని.. పిచ్చాపాటీ కార్యక్రమం కూడా కాదని.. పార్టీకి సంబందించినంత వరకు ఇది.. భవిష్య త్ వ్యూహాలను అమలు చేసే అతి పెద్ద కార్యక్రమమని నాయకులకు తేల్చి చెప్పారు. ఒక కార్యక్రమాన్ని భిన్నంగా నిర్వహిస్తే.. దానిని లైట్ తీసుకుంటామంటే ఎలా? అని ఆవేదన వ్యక్తం చేశారు.

తాజాగా పార్టీ సీనియర్ నాయకులతో భేటీ అయిన నారా లోకేష్.. కాఫీ కబుర్లు కార్యక్రమం ఇచ్చిన రిజల్ట్‌పై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో జరిగిన మార్పులు తెలుసుకున్నారు. చాలా మంది కార్యకర్తలకు.. నాయకుల కు మధ్య ఇంకా దూరం కొనసాగుతోందని తెలుసుకుని.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాఫీ కబుర్లు కార్యక్రమంలో చెప్పినట్టే కార్యకర్తలు, నాయకులు వ్యవహరించాలని తేల్చి చెప్పారు. ఈ విషయంలో తేడా రాకూడదని తేల్చి చెప్పారు.

**ఏం చెప్పారు.. ?**

ఇతర కార్యక్రమాల్లో చెబుతున్నట్టే.. కాఫీ కబుర్లు కార్యక్రమంలోనూ.. నాయకులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గ్రౌండ్ లెవిల్లో కూటమి పార్టీల మధ్య సఖ్యత, కలివిడి గా ముందుకు సాగడాన్ని.. వచ్చే 15 ఏళ్లు పార్టీ అధికారంలో ఉండాలంటే.. చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా చెప్పారు. చంద్రబాబు సైతం.. ఇదే విషయాన్ని పదే పదే చెప్పారు. పార్టీని ఎలా ముందుకు



తీసుకువెళ్లాలో కూడా దిశానిర్దేశం చేశారు. అయితే.. కొందరు దీనిని లైట్ తీసుకున్నట్టు పార్టీకి సమాచారం ఉంది. దీనిపై నే లోకేష్ ఫైరయ్యారు. కాఫీ కబుర్లు కావని.. భవిష్యత్తు వ్యూహాలని చెప్పారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## కేబుల్ బ్రిడ్జిపై ప్రమాదం..



**100 కి.మీ వేగంతో డివైడర్‌ను ఢీకొట్టిన కారు**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కేబుల్ బ్రిడ్జిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్లిన ఓ కారు.. డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారు 100 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాద సమయంలో బ్రిడ్జిపై ఇతర వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గింది.

## జడ్చర్ల ఘటన.. యువకుడూ మృతి



**మహబూబ్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** జడ్చర్ల పట్టణానికి చెందిన వైష్ణవి (22)ని హైదరాబాద్‌కు చెందిన తేజ (28) అనే యువకుడు శనివారం గొంతుకోసి హతమార్చిన విషయం తెలిసిందే. కొన్నాళ్లుగా ప్రేమ పేరుతో వెంటపడగా ఆమె అంగీకరించలేదు. ఈ క్రమంలోనే యువతికి పెళ్లి సంబంధం కుదిరిందన్న విషయం తెలుసుకున్న అతడు ఈ దారుణానికి పాల్పడ్డాడు. దీంతో స్థానికులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. చేతులు కట్టేసి బండరాళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ తేజ.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## సిద్దిపేట సమీపంలో ఆల్ర్పాజోలం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



**సిద్దిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేట ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని కలకుంట కాలనీ వద్ద ఓ వాహనంలో ఆల్ర్పాజోలం తరలిస్తున్న ముగ్గురిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.85.36లక్షల నగదు, 39 కిలోల ఆల్ర్పాజోలం స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో కెమిస్ట్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. నిందితులు గత ఐదేళ్లుగా అక్రమంగా ఆల్ర్పాజోలం తయారుచేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ముగ్గురినీ సిద్దిపేట మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారు.

## మొయినాబాద్ జంట హత్యల కేసు.. నిందితురాలు ఆత్మహత్యాయత్నం




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. ఆబేదాబేగం, మహబూబాబీ.. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. ఈ కేసులో కరీమాబేగంను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పీఎస్‌లో విచారిస్తుండగా.. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. హుటాహుటిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

## చీరాలలో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై కత్తితో దాడి



**చీరాల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ పై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసిన సంఘటన బాపట్ల జిల్లా చీరాల ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. చీరాల జయంతిపేటకు చెందిన హరీష్ రోజు మాదిరిగానే విధులకు హాజరయ్యేందుకు బస్టాండ్ వద్దకు వచ్చారు. బస్టాండ్ సమీపంలో టీ తాగుతున్న హరీష్ పై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. నడుము భాగంలో తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు వెంటనే చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై చీరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

**మామిడికాయ కోసం వెళ్తే..**

## బంగారు గొలుసు చోరీ

**విశ్వం వాయిస్ న్యూస్ :** బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు.. మామిడికాయ కోసం వెళ్లిన ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని తిలక్‌నగర్‌లో జరిగింది. చోరీ చేసిన ఆ దుండగుడు క్షణాల్లోనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాలో నమోదయ్యాయి. తమ ఇంటికి సమీపంలో ఉన్న చెట్టు నుంచి మామిడికాయ రాలితే తీసుకునేందుకు వెళ్లానని బాధితురాలు ఓడ్నాల భూలక్ష్మి తెలిపారు. తిరిగి వస్తుండగా దుండగుడు గొలుసు లాక్కెళ్లాడని వాపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నడిరోడ్డుపై రాయితో భార్య తలపై భర్త దాడి

**ఉయ్యూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లాలోని ఉయ్యూరులో దారుణం చోటుచేసుకుంది. కాటూరు రోడ్డులో పుష్పవతి అనే మహిళపై ఆమె భర్త సాంబయ్య హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నడిరోడ్డుపై ఆమె తలపై రాయితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాంబయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మనస్పర్థలతో భార్యాభర్తలు వేరుగా ఉంటున్నట్లు సమాచారం.

## రోడ్డుపై ఆడుకుంటున్న బాలుడి పైనుంచి వెళ్లిన జీప్..

**తప్పిన ప్రాణాపాయం**

**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నటరాజ్‌నగర్‌లో త్రుటిలో ఓ బాలుడికి ప్రాణాపాయం తప్పింది. ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారి పై నుంచి జీప్ వెళ్లింది. దీంతో బాలుడికి గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై బాలుడిని గమనించకుండా జీప్ డ్రైవర్ ఢీకొని ముందుకు వెళ్లాడు. చిన్నారి కేకలు విన్న కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని బాలుడిని సమీప ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి

## ప్రేమ పేరుతో వేధించి గొంతుకోశాడు

**జడ్చర్లలో యువతి దారుణ హత్య**

**యువకుడిపై స్థానికుల దాడి.. పరిస్థితి విషమం**




**జడ్చర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమ పేరుతో యువతిని వేధించిన యువకుడు ఆమెకు పెళ్లి సంబంధం కుదరడంతో కక్ష పెంచుకుని కత్తితో గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. ఈ దారుణ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం సాయంత్రం జరిగింది. పట్టణ సీఐ కమలాకర్, స్థానికుల కథనం ప్రకారం.. జడ్చర్ల పట్టణంలోని ఎర్రసత్యం కాలనీలో నివాసం ఉంటున్న రామచంద్రయ్య, శ్రీలత దంపతుల పెద్ద కుమార్తె వైష్ణవి(22) ప్రస్తుతం ఓ పాఠశాలలో రిసెప్షనిస్టుగా పని చేస్తున్నారు. గతంలో ఆమె హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో పని చేశారు. ఆ సమయంలో పరిచయమైన హైదరాబాద్‌కు చెందిన తేజ (28) కొన్నాళ్లుగా ప్రేమ పేరుతో వెంటపడగా ఆమె అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో యువతికి పెళ్లి సంబంధం కుదిరింది. విషయం తెలుసుకున్న యువకుడు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. శనివారం ఆమె పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా వెంబడించాడు. వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావమైన యువతిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడు హత్య చేసి పారిపోతుండగా స్థానికులు నసురుల్లాబాద్ రోడ్డుకు సమీపంలో వెంబడించి పట్టుకున్నారు. అతని చేతులు కట్టేసి బండరాళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ తేజను పోలీసులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. దాడి చేస్తున్న సమయంలో.. తనను వైష్ణవి ప్రేమ పేరిట మోసం చేసిందని, డబ్బులు కాజేసిందని చెప్పిన యువకుడి వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

## డయాబెటిస్ రోగులు చేపలు తినొచ్చా..?

**ఇలా చేస్తే దెబ్బకు షుగర్ కంట్రోల్..**



ప్రస్తుత కాలంలో చాలామంది డయాబెటిస్ (మధుమేహం)తో బాధపడుతున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా లక్షలాది మంది దీనితో పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డయాబెటిస్ ఉన్నవారు చేపలు తినవచ్చా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. దీనిపై వైద్య నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.. ప్రస్తుత కాలంలో చాలామంది డయాబెటిస్ (మధుమేహం) తో బాధపడుతున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా లక్షలాది మంది దీనితో పోరాడుతున్నారు. డయాబెటిస్ అనేది రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే దీర్ఘకాలిక వ్యాధి.. ఇది శరీరానికి సరిపడినంత ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు లేదా ఉన్న ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేనప్పుడు వస్తుంది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్న వారు తీసుకునే ఆహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మందికి పలు సందేహాలు వస్తుంటాయి.. డయాబెటిస్ ఉన్నవారు చేపలు తినవచ్చా అనే ప్రశ్న తరచుగా ఉత్పన్నమవుతుంది. అయితే.. దీనిపై వైద్యులు ఫుల్ క్లారిటీ ఇస్తున్నారు. డయాబెటిస్ ఉన్నవారు చేపలు తినడంలో ఎటువంటి ఇబ్బంది లేదని, వాస్తవానికి ఇది లీన్ ప్రోటీన్ కు అద్భుతమైన మూలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. చేపలలో విటమిన్ డి, ఐరన్ వంటి అనేక విలువైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి చాలా అవసరం. కండరాల బలోపేతానికి చేపలు పనికివస్తాయని పేర్కొంటున్నారు.

**వండే విధానం..**

అయితే.. చేపలను వండే విధానం వాటి పోషక విలువలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అధిక ఉష్ణోగ్రత వద్ద వండటం వల్ల చేపలలోని విటమిన్లు, ఖనిజాలు నశించే అవకాశం ఉంది. దీనికి విరుద్ధంగా, కుండలో తక్కువ మంటపై వండటం ఒక ఆరోగ్యకరమైన ప్రక్రియ. అలాగే.. చేపల కూరలో నూనె వాడకం గురించి కూడా జాగ్రత్త వహించాలి. సాధారణంగా చేపల కూర అంటే ఎక్కువ నూనె వాడుతుంటారు.. అయితే వీలైనంత తక్కువ నూనెతో వండటం అలవర్చుకోవాలి.

**మసాలాల ప్రభావం..**

చేపల పులుసులో వాడే మసాలాలకు కూడా కొన్ని పోషక విలువలు ఉంటాయి. కొన్ని మసాలాలకు యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నందున అవి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. అయితే, మసాలాలను, ముఖ్యంగా కారం, ఉప్పును, మితంగా వాడాలంటున్నారు. అధికంగా కారం వాడటం వల్ల ఎసిడిటీ, గ్యాస్ట్రైటిస్ వంటి జీర్ణ సమస్యలు తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు.. ఏదైనా ఆహారాన్ని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. డయాబెటిస్ ఉన్నవారు చేపలను సరైన పద్ధతిలో వండి, మితంగా తీసుకోవడం ద్వారా వాటి పూర్తి పోషక ప్రయోజనాలను పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## అరికాళ్ళపై షుగర్ దాడి..

**ఉస్మానియాలో ప్రత్యేక చికిత్స**






డయాబెటిస్ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ప్రతి ఇంట్లో మధుమే వ్యాధిగ్రస్తులు ఉంటున్నారు. అయితే ఇప్పుడు ఈ వ్యాధి అరికాళ్లపై ప్రభావం చూపుతోంది. దీంతో హైదరాబాద్ లోని ఉస్మానియా ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. అలాగే.. షుగర్ ఉన్న చాలామందికి అసలు తెలియకుండానే కాళ్లలో ప్రమాదం మొదలవుతోంది. నొప్పి లేదు.. మంట లేదు.. కానీ లోపల నాడులు క్రమంగా పనిచేయడం మానేస్తున్నాయి. ఇదే డయాబెటిక్ న్యూరోపతి. ఈ సమస్యను గుర్తించడంలో ఆలస్యం అయితే చిన్న గాయం కూడా పెద్ద ముప్పుగా మారుతోంది. కొన్నిసార్లు అది కాళ్లు కోల్పోయే స్థాయికి తీసుకెళ్తోంది. షుగర్ ఎక్కువకాలంగా ఉన్నవారిలో నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. ముఖ్యంగా పాదాల్లో స్పర్శ తగ్గిపోతుంది. కాలికి గాయం అయినా నొప్పి తెలియదు. రక్త ప్రసరణ సరిగా లేక గాయం మానడానికి సమయం పడుతుంది. అదే సమయంలో ఇన్‌ఫెక్షన్ శరీరంలోకి చొచ్చుకుపోయే అవకాశాలు పెరుగుతాయి. పరిస్థితి చేయి దాటితే ప్రాణాలు కాపాడేందుకు కాలును తొలగించాల్సిన పరిస్థితి కూడా ఎదురవుతోంది. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉస్మానియా ఆసుపత్రి మధుమేహ బాధితులకు కీలక సహాయంగా నిలుస్తోంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న 'డయాబెటిక్ ఫుట్ కేర్ క్లినిక్'లో పాదాలకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు ఈ క్లినిక్‌కు వస్తుండగా, ఎక్కువ మంది 30 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు వారే. మహిళలకంటే పురుషులే అధికంగా చికిత్స పొందుతున్నారు. కాళ్లలో అల్సర్లు, పుండ్లు, మానని గాయాలతో బాధపడుతూ వచ్చే రోగులను ముందుగా స్క్రీనింగ్ చేసి, న్యూరోపతి ఉందా లేదా అన్నది వైద్యులు నిర్ధారిస్తున్నారు. పరిస్థితిని బట్టి గాయాలకు చికిత్సలు చేయడంతో పాటు, మళ్లీ గాయాలు కాకుండా ప్రత్యేకంగా రూపొందించిన చెప్పులను కూడా అందిస్తున్నారు. పేద రోగులకు ఈ సేవలు పూర్తిగా ఉచితంగా లభిస్తున్నాయి.

గత రెండేళ్లలో దాదాపు రెండు వేల మంది డయాబెటిక్ న్యూరోపతి రోగులకు చికిత్సలు అందించామని, వారిలో 200 మందికి ప్రత్యేక చెప్పులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. షుగర్ ఉన్నవారు కాళ్లను నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిశీలించుకోవడం, చిన్న సమస్య కనిపించినా వెంటనే ఆసుపత్రిని సంప్రదించడం ద్వారా పెద్ద ప్రమాదాలను తప్పించుకోవచ్చని డాక్టర్స్ సూచిస్తున్నారు. ఈ సేవలను టెలి కాల్ ద్వారా ముందే బుక్ చేసుకుని.. సమయం వృథా అవ్వకుండా చికిత్స పొందవచ్చు.

### నది శుభ్రతకు శ్రీకారం చుట్టిన
# గోదావరి స్విమ్మర్స్ క్లబ్ సభ్యులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర గోదావరి నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీజీసీ సభ్యులు, గోదావరి స్విమ్మర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆదివారం స్థానిక పుష్కరాల రేవు వద్ద గోదావరి నదిని శుభ్రపరిచే కార్యక్రమానికి స్విమ్మర్స్ క్లబ్ సభ్యులు శ్రీకారం చుట్టారు. పడవల సహాయంతో గోదావరి అడుగుభాగంలో ఉన్న చెత్త, నాచు, గడ్డిని తొలగించారు. నాలుగు ఐదు గంటల పాటు సభ్యులు కష్టపడి గోదావరిలో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఒడ్డున వేశారు. ఈ కార్యక్రమంలో రౌతు సూర్య ప్రకాష్ రావు పాల్గొని సభ్యులతో పాటు ఆయన కూడా శ్రమదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజమండ్రి పేరు చెబితే మొట్టమొదటిగా గుర్తుకు వచ్చేది పవిత్ర గోదావరి నది అని, అలాంటి నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఒకప్పుడు గోదావరి నదిపై ఉన్న బ్రిడ్జిపై రైలు వెళ్తుంటే గలగల పారే గోదావరి శబ్దం వినడానికి ఎంతో హాయిగా ఉండేదని రౌతు అన్నారు. పవిత్ర గోదావరిలో పాత బట్టలు, పూజలు చేసిన తర్వాత కొన్ని వస్తువులు వేసి నదిలో ఇబ్బందికర వాతావరణం కలుగజేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటికి, సాగునీటికి జీవనాధారమైన గోదావరి నదిని పరిరక్షించుకోవడానికి మేధావులు, మఠాధిపతులు, పండితులు తమ గళాన్ని విప్పగలిగితే ప్రజల్లో చైతన్యం వస్తుందని రైతు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఏటా గోదావరి స్విమర్స్ క్లబ్ తరపున గోదావరి నదిని శుభ్రం చేస్తుంటామని,, క్లబ్లో ఉన్న సభ్యులందరూ ఇందులో పాల్గొని శ్రమిస్తారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు రూ 450 కోట్ల రూపాయలతో గోదావరిలో మురుగునీరు కలవకుండా డెడికేటెడ్ ఛానల్ నిర్మాణానికి ప్రతిపాదనలు జరిగాయన్నారు. వాటర్ వర్క్స్ లో నీటిని శుద్ధి చేసేందుకు ఉండే రా పాయింట్ ఎగువన డ్రైనేజీ వ్యవస్థ ఉండడం ఆ నీటిని తిరిగి శుద్ధి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం విచారకరమన్నారు. ఈ విషయాన్ని తాను ఎమ్మెల్యేగా ఉండగా రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఆయన ఈ సమస్యను పరిష్కరించడానికి అన్ని ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు. ఆయన మరణం వల్ల ఆ ప్రణాళిక అక్కడే ఆగిపోయిందన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో అప్పటి మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు, ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఎంతో చొరవ చూపించి సమస్యను పూర్తిగా నిర్మూలించడానికి శాయశక్తులా కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్విమర్స్ క్లబ్ ప్రెసిడెంట్ గుబ్బల వెంకటరమణ సెక్రటరీ పాలపర్తి దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి ఆంజనేయ ప్రసాద్, దుబాయ్ శీను, రాజు, తాతారావు, ఆదినారాయణ, టైలర్ లక్ష్మణరావు, గ్లోబల్ కిషోర్ గోల్డ్ నాగు, ఆర్వివి కుమార్, వై.ఎస్.ఆర్ శ్రీను, కుక్క తాతబ్బాయి, ఈగల ప్రసాద్, ఆంధ్ర రవి ప్రకాష్, వైవి రంగనాయకులు, ఎల్లప్పనాయుడు, తోట మధు, కోట రమణ, పీటి మాస్టర్ నాగేశ్వరరావు, నీమ్ చంద్ జైన్, బ్యాంకు రామారావు, బ్రహ్మ గిరీష్, ఎల్ఐ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి
# వ్యక్తి మృతి

**గండిపోశమ్మ ఆలయ సమీపంలో ఘటన**



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా దేవీ పట్నం మండలంలోని ప్రసిద్ధ గండి పోశమ్మ ఆలయం స్నానాల ఘాట్ వద్ద ఆదివారం చోటుచేసుకున్న విషాద ఘటన భక్తులను కలచివేసింది. గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామానికి చెందిన గోపాల సతీష్ (25), తండ్రి నాగేశ్వరరావు, తన స్నేహితులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. దర్శనానికి ముందు గోదావరిలో పవిత్ర స్నానం చేసేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి నదిలోకి దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి లోతైన నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. స్నేహితులు, స్థానికులు కేకలు వేస్తూ రక్షించే ప్రయత్నం చేసినా ప్రవాహం ఎక్కువగా ఉండటంతో సతీష్ కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న దేవీపట్నం ఎస్సై షరీఫ్, పోలీసులు సిబ్బంది, ఫైర్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులు సంఘటన స్థలానికి చేరుకుని గంటల తరబడి గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం యువకుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షరీఫ్ వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.

# హెచ్ఐవీ బాధితులకు అండగా నిలుద్దాం..

### – అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవంలో పిలుపు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారకోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్ వసుంధర ఆదేశానుసారం ఆదివారం రాజమండ్రి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఏఆర్టీ సెంటర్ నందు హెచ్ఐవీ,ఎయిడ్స్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ అలాగే బాధితులకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఏఆర్టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యూజే కిరణ్ ప్రారంభించి మాట్లాడుతూ సమాజంలో హెచ్ఐవీ పై ఉన్న కళంకాన్ని రూపుమాపడం కోసం ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ తో మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ కొవ్వొతులు వెలిగించి ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హెచ్ఐవి తో జీవిస్తున్న వారిని గౌరవిస్తూ అండగా నిలుద్దామని ప్లతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ఎమ్సీ సభ్యులు,పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,అఖిలపక్షం కమిటీ కన్వీనర్ దేశిరెడ్డి బలరామ్ నాయుడు,ఏఆర్టీ సిబ్బంది, ఐసీటీసీ సిబ్బంది, పీపీటీసి సిబ్బంది, డీఎస్ఆర్సీ, సిఎస్సీ 2.0, నారీసాక్ష్యం, సీఎఫ్ఐ, యూఈటిఎస్, చేంజెస్, వీహెచ్ఎస్ తదితర ఎన్జీవోలు పాల్గొన్నారు.

### బీసీ సెల్ బలోపేతమే లక్ష్యం..
# జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలి

**మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరంలో బీసీ సెల్‌ను మరింత బలోపేతం చేసేందుకు నగర అధ్యక్షుడిగా పీతా రామకృష్ణను నియమించినట్లు మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆదివారం మోరంపూడి సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీసీ సెల్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి నగరంలోని 42 వార్డులు, 86 సచివాలయాల పరిధిలో ప్రతి సచివాలయానికి 20 మంది చొప్పున బీసీ సెల్ సభ్యులను నియమిస్తే సుమారు 1600 మంది యువజన బృందం సిద్ధమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో రాజమండ్రి నగరానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని తెలిపారు. పార్టీలో వర్గాలు కాదని, పార్టీ ముఖ్యమని హితవు పలికిన ఆయన, కొందరి వర్గ విభేదాలు మరియు కుమ్మక్కు రాజకీయాల వల్లే పార్టీ నష్టపోయిందని విమర్శించారు. స్వలాభం కోసం కొందరు నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పక్క పార్టీలకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. 16 సంవత్సరాలుగా పార్టీ అనేక ఎన్నికలను ఎదుర్కొన్నదని గుర్తుచేసిన భరత్ రామ్, నగరంలో పార్టీ ఓటమికి టిడిపి నాయకులతో కొందరు వైసీపీ నాయకుల కుమ్మక్కు రాజకీయాలే కారణమని ఆరోపించారు. వెన్నుపోటు పొడిచే నాయకులను ఈవీఎం ఎమ్మెల్యే ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. "పార్టీకి మోసం చేస్తే కన్నతల్లికి మోసం చేసినట్లే" అని వ్యాఖ్యానించిన ఆయన, ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తే నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయవచ్చని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని, జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు వంటి ప్రజాహిత కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని యువతకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, 72 సంవత్సరాల చరిత్రలో ఒక బీసీ యువకుడిని పార్లమెంటుకు పంపిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని అన్నారు. అలాగే మార్గాని భరత్ రామ్ నాయకత్వంలో రాజమండ్రి నగరం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని తెలిపారు.

## రహదారి ప్రక్కనే ఇసుక మేటలు - వాహనదారులకు ఇక్కట్లు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరం గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలో రహదారిని ఆనుకొని ఇసుక మేటలు కొండలను తలపిస్తున్నాయి. ఈ ఇసుక మేటల వలన ద్విచక్ర వాహనదారులు ప్ర యాణం చేస్తున్నప్పుడు కళ్ళలోకి ఇసుక దూసుకొస్తుందంటూ వాహనదారులు బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా బొడ్డు వెంకటరమణ చౌదరి జన్మదిన వేడుకలు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో గీతా బాలాజీ థియేటర్ సమీపంలో రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి జన్మదిన వేడుకలను కూటమి నాయకులు కార్యకర్తలు కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచి ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే మండల కూటమి నాయకులు బొడ్డుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెంకటరమణ చౌదరి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతోనూ, అష్ట ఐశ్వర్యాలతోనూ తులతూగాలని పలు ఆలయంల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించడం జరిగిందని మండల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గెడ్డం తిమ్మారావు, గద్దే వెంకటకృష్ణ చౌదరి (నళిని), కాండ్రు శేఖర్, వలవల రాజా, సంగన చిన పొసియ్య, పుక్కాల శ్రీనివాస్, ఓబులనేని కృష్ణ చైతన్య తదితర కూటమి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

### చినకొండేపూడి జాతరలో పట్టు పందెం నిర్వహణకు
## అనుమతి ఇవ్వాలి : రైతులు, నాయకులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో జరుగనున్న శ్రీశ్రీశ్రీ మాతృశ్రీ వెదుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా సంప్రదాయ పట్టు పందెం (ఎద్దుల పందెం) నిర్వహణపై సీపీఐ(ఎంఎల్) పార్టీ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. గ్రామ రైతులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని పట్టు పందెం నిర్వహణపై చర్చించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా జాతరలో భాగంగా పట్టు పందెం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఇది గ్రామీణ సంస్కృతి, రైతుల సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు ఈసారి కూడా ఎద్దుల పందెం ప్రశాంత వాతావరణంలోనిర్వహించేందుకు ప్రభుత్వం, పోలీసులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు, కాంగ్రెస్ నాయకుడు రంగ శీను, బీజేపీ నాయకుడు బాలయోగి పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్, రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, పోలీసు అధికారులు మరియు ప్రభుత్వ శాఖలు సానుకూలంగా స్పందించి పట్టు పందెం నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొనే అవకాశం ఉన్నందున భద్రతా చర్యలు తీసుకుని సంప్ర దాయ క్రీడలను నిర్వహిం చేందుకు అధికారులు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.





### దళిత క్రైస్తవులకు

# ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమిస్తాం

**అధిక సంఖ్యలో హాజరైన క్రైస్తవ సంఘ నాయకులు**

**బొబ్బర్లంక నుండి రావులపాలెం వరకు క్రైస్తవ సంఘాల భారీ శాంతి ర్యాలీ**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను రద్దు చేస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) ఇటీవల ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రెవ.పి.ఆశీష్ విక్టర్, రెవ.ఎన్.డేవిడ్ రాజు వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్స్, సభ్యులు ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. బొబ్బర్లంక నుండి రావులపాలెం వరకు సాగిన ఈ ర్యాలీలో శనివారం రావులపాలెంలోని రెవ.డామియన్ ఇశ్రాయేలు, బిషప్.సాకా జార్జువ బెనహోర్,రెవ.రత్నరాజు, రెవ.తిమోతి ప్రకాష్, రెవ.నల్లూరి నోవా ఎన్ఆర్డీ, రెవ.జగజ్జీవన్, రెవ.ఆర్. అరుణ్ కుమార్, బిషప్.అడపా ప్రసాద్, రెవ.ఎమ్.ఏసురత్నం, పాస్టర్.ఏసురత్నం పాదయాత్రలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఇందిరాకాలనీ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రైస్తవ నాయకులు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించకపోవడానికి మూలం 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులోని క్లాజ్ 3 అని గుర్తు చేశారు. 1950లో ఈ ఉత్తర్వు వచ్చినప్పుడు కేవలం హిందూ మతానికి చెందిన వెనుకబడిన, అంటరానితనానికి గురైన కులాలను మాత్రమే షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించారన్నారు. రెండు సార్లు చట్టసవరణలు చేసినప్పుడు దళిత క్రైస్తవులకు ఎందుకు చేయరని ఈ సందర్భంగా ప్రశ్నించారు. రాజ్యాంగ ఉత్తర్వులను కాలక్రమేణా మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా సవరించిన దాఖలాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1956లో చట్టాన్ని సవరించి సిక్కు మతంలోని దళితులకు, అలాగే 1990లో మరోసారి చట్టాన్ని సవరించి బౌద్ధ మతంలోని దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలా రెండు సార్లు చట్ట సవరణలు చేసి దళిత సిక్కులకు,దళిత బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించినప్పుడు.. సమాజంలో ఇప్పటికీ ఎన్నో దాడులు,వివక్ష, అంటరానితనానికి గురవుతున్న దళిత క్రైస్తవులకు ఎందుకు ఎస్సీ హోదా కల్పించారని కేంద్రాన్ని ప్రశ్నించారు. మతం మారినంత మాత్రాన దళితులపై జరిగే సామాజిక వివక్ష మారిపోలేదని, అందుకే దళిత క్రైస్తవులకు న్యాయం జరిగే వరకు దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే దళిత క్రైస్తవ సంఘాలు క్షేత్రస్థాయిలో పని చేస్తామన్నారు. ఈ శాంతి ర్యాలీలో పలు క్రైస్తవ సంఘాల నాయకులు, సంఘ సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు అనుకూలంగా నినాదాలు చేశారు.

# సెన్సస్ విధానాన్ని పరిశీలించిన జాయింట్ డైరెక్టర్



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలంలోని కుండలేశ్వరం గ్రామంలో సెన్సస్ 2027 ఏవిధంగా చేస్తున్నారో పరిశీలించడానికి ఆదివారం సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి.వి. చంద్రకళ విచ్చేశారు. ఏమితోపాటు జిల్లా సెన్సెస్ ఇంచార్జ్ తరుణ్ హోట్కర్, హెచ్ ఎల్బి నెంబర్ 43ను ఆకస్మికంగా సందర్శించి ఏన్యూమరేటర్ ఏవిధంగాసర్వే చేస్తున్నారోపరిశీలించారు. సెన్సెస్ లో ఉన్న 33 క్వశ్చన్స్ ఆ ఇంటి యజమానిని ఏ విధంగా అడుగుతున్నారు అని ఎన్యుమరేటర్ ని అడిగి స్వయంగా తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్ సెన్సెస్ సర్వే పట్ల సంతృప్తి చెందారు.సెన్సస్ సర్వేలో ఏ గణన గృహాన్ని వదలకుండా పూర్తి పారదర్శకతతో త్వరితగతిన సర్వేను పూర్తి చేయవలసిందిగా ఎన్యుమరేటర్లకు సూచనలు జారీ చేశారు.అక్కడ ప్రజలకు సెన్సెస్ వల్ల ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ఆగిపోవని, అలాంటి అపోహలు పెట్టుకోవద్దని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన మండలం సెన్సస్ సూపర్వైజర్ జెవివి సత్యనారాయణ, ఎన్యుమరేటర్లు వాండ్రపు రామకృష్ణ, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరం జనసేన పార్టీ పగ్గాలు మగ్గు విజయ్‌కు ఇవ్వాలి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, ముమ్మిడివరం నియోజక వర్గం పార్టీ పగ్గాలు విజయ్‌కి ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి వెన్నునుకల ఉంటూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తు, జనసేన సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తు నియోజకవర్గంలో జనసేన అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి వెల కట్టలేనిది అని అంటున్నారు, క్రియాశీలక సభ్యత్వం, పేదలకి ఆయన చేస్తున్న సేవ, పార్టీ బలపేతం ఇలా ఎన్నో అంశాలు ఆయన ఖాతా లో ఉన్నాయి, ఇలాంటి శైలి ఉన్న వ్యక్తి పార్టీ కి మద్దతుగా ఉండటం మన అదృష్టం అని అక్కడ శ్రేణులు చెపుతున్నారు, ఇలాంటి శైలి ఉన్న వ్యక్తికి జనసేన పార్టీ అధికారిక మద్దతు ఇస్తే జనసేన పార్టీ ఇంకా అభివృద్ధి చెందుతుందిని తెలిపారు.

### కోటిపల్లి రాజరాజేశ్వరి స్వామి ఆలయం వద్ద

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరి సమేత ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు, ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చాలనే సంకల్పంతో గత ఐదు రోజులుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు గొడవర్తి రామకృష్ణ చౌదరి, వెంటూరి వీర రాఘవ చౌదరిలు మాట్లాడుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ల నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. “సేవే పరమో ధర్మః” అనే భావనతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు, ఆలయానికి వచ్చే భక్తులకు, ప్రయాణికులకు ఈ చల్లని మజ్జిగ ద్వారా కొంత ఉపశమనం కలిగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న వాసంశెట్టి సత్యం, మంత్రి సుభాష్‌ల సేవా భావాన్ని స్థానికులు, భక్తులు వేనోళ్లా ప్రశంసిస్తూ అభినందనలు తెలియజేసారు.

# రామచంద్రపురంలో నేడు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం మే 18వ తేదీ సోమవారం ఉదయం 10:00 గంటలకు ప్రత్యేకంగా “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో =ఖూ శ్రీమతి ఎ. సరళావతి గారితో పాటు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించనున్నారు. ఈ వేదిక ద్వారా వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. కావున డివిజన్ పరిధిలోని అర్జీదారులు తమ సమస్యల దరఖాస్తులతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అదేవిధంగా నేరుగా రాలేని ప్రజల సౌకర్యార్థం ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రభుత్వం పలు సేవలను అందుబాటులోకి తెచ్చింది. అర్జీదారులు ఎవవనశీఖుఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009 కు మెసేజ్ చేయడం ద్వారా ఫిర్యాదులను పంపడంతో పాటు పౌర సేవలను పొందవచ్చునని అధికారులు తెలిపారు. ఇక పిజిఆర్ఎస్ ఫిర్యాదుల వివరాలు ఇతర సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నంబర్ కూడా అందుబాటులో ఉంటుందని వారు పేర్కొన్నారు.

# పిల్లలే సంపద -ఏపీలో కొత్త కార్యక్రమం



పిల్లలు ఉన్న ఇల్లు సిరి సంపదల లోగిలి అని పెద్దలు ఎనాడో చెప్పారు. గంపెడు పిల్లలతో తులతూగాలని కొత్త దంపతులను దీవించేవారు. ప్రతీ ఇంట్లో కనీసంగా అరడజన్ మందికి తక్కువ కాకుండా పిల్లలు ఉండేవారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత లాభం అన్నది పాత తరం గట్టిగా నమ్మింది. అయితే కాలం మారింది. చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని ఒక స్లోగన్ వచ్చింది. మరో వైపు ఉమ్మడి కుటుంబాలు చితికిపోయాయి. దాంతో కుటుంబ వ్యవస్థలో చాలా మార్పులు వచ్చేశాయి. ఇక కుటుంబ నియంత్రణను ఒక ఉద్యమంగా ఏపీ లాంటి రాష్ట్రాలు చేశాయి. ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు అని పద్ధతులు గత తరాలు పాటించాయి. ఈనాటి తరం మరింతగా ముందుకు అడుగులు వేసి ఒక్క బిడ్డ ముద్దు అంటోంది. నవీన తరం అయితే పిల్లలు కాదు పెళ్ళే వద్దు అంటోంది. ఇలా కుటుంబ వ్యవస్థలో భారీ మార్పులు వచ్చేశాయి.

**దార్శనీకుడిగా బాబు :** ఇక కుటుంబ సంక్షోభానికి ఈ పరిణామాలు అన్నీ దారి తీస్తున్నాయి. ఈ క్రమంలో ఇదే పరిస్థితి కొనసాగితే జనాభా అంతరించి మానవ మనుగడ ప్రమాదంలో పడుతుందని సామాజిక వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుముఖం పట్టడం తీవ్ర కలవరాన్ని రేపుతోంది. ఈ నేపథ్యంలో దార్శనీకుడిగా పేరు ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే జనాభా పెరుగుదల విషయంలో సీరియస్ గానే చర్యలు తీసుకుంటున్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా ఆయన ఈ విషయంలో యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తున్నారు. ఫలితంగా ఏపీలో జనాభా పెరుగుదల విషయంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుడుతున్నారు.

**భారీగా ప్రోత్సాహం :** ఏపీలో జనాభా పెరుగుదలకు ప్రభుత్వం భారీ ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తుందని శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీ ప్రభుత్వం పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై పూర్తి నిబద్ధతతో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజున చూస్తే దేశ ప్రగతిలో పిల్లలే అసలైన సంపద అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోందని జనాభా తగ్గుదల రేటును అరికట్టేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని బాబు చెప్పుకొచ్చారు.

**ఏపీలో చైతన్యం :** ఇక ఏపీలో ప్రజలలో చైతన్యం కోసం పిల్లలే సంపద పేరుతో త్వరలో కొత్త కార్యక్రమం చేపడతామని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు ప్రకటించారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా జనాభాను దేశానికి సంపదగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఏపీలో మూడో సంతానానికి 30 వేల రూపాయలు, నాలుగో సంతానానికి 40 వేల రూపాయలు ప్రోత్సాహకరంగా అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పడం విశేషం. చాలామంది ఒక బిడ్డతోనే సరిపెట్టుకుంటున్నారని ఈ కారణంగా చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరుగుతోందని బాబు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆర్థిక వ్యవస్థకు ముప్పు :** జనాభా తగ్గడం వల్ల ఆర్థిక వ్యవస్థకు పెను ముప్పు అని బాబు అన్నారు. ఈ రోజున ప్రపంచంలో జనాభా తగ్గిన ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని బాబు గుర్తు చేశారు. గతంలో కుటుంబ నియంత్రణ అమలుపై విస్తృతంగా పనిచేశామని ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నానని బాబు వివరించారు. పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. అంతే కాకుండా స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా తల్లులకు పిల్లలకు పౌష్టికాహారం అందించేలా ఆంగన్వాడీ కేంద్రాలను కూడా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం కింద 15 వేల రూపాయలు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నామని బాబు వివరించారు. రానున్న కాలంలో ఈ మొత్తాలను కూడా ఆయన తెలిపారు. మొత్తం మీద ఏపీలో జనాభా పెరుగుదల అన్నది ఒక యజ్ఞంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని ఫలితాలు తొందరలోనే ఏపీ చూస్తుందని సామాజిక వేత్తలు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కూటమిలో రాజ్యసభ రగడ.. చంద్రబాబును ఇరకాటంలో పెడుతున్న బీజేపీ?



బీజేపీ తరుపున ఏపీ నుంచి రాజ్యసభ స్థానానికి తమిళనాడు నేత అన్నామలైని ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై టీడీపీ కూటమిలో తీవ్ర చర్చ జరుగుతోందని అంటున్నారు. ఇప్పటికే రెండు స్థానాలు తీసుకున్న బీజేపీ, త్వరలో జరిగే ఎన్నికల్లోనూ మరోసీటు కోరుతుండటంపై టీడీపీలో మింగుడు పడని పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. పార్టీలో తీవ్రమైన పోటీ ఉండగా, బీజేపీ ప్రతిసారి రాజ్యసభ సీటును ఆశిస్తుండటం సరికాదని టీడీపీ నేతల్లో విస్తృత చర్చ జరుగుతోందని అంటున్నారు. కూటమి ధర్మం కింద ఇప్పటివరకు తాము ఏమీ అనలేకపోతున్నామని, కానీ వరుసగా రాజ్యసభ స్థానాలు తీసుకుంటే పార్టీలో ఆశావహులకు న్యాయం చేసేది ఎలా అంటూ టీడీపీ సీనియర్లు అధిష్టానాన్ని నిలదీస్తున్నట్లు చెబుతున్నారు. ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. వైసీపీకి చెందిన ముగ్గురు, టీడీపీ నుంచి ఒకరు ఈ నెలలో రిటైర్ అవుతున్నారు. అసెంబ్లీలో ప్రస్తుత బలాబలాల ప్రకారం ఈ నాలుగు సీట్లను కూటమి సునాయాశంగా గెలుచుకుంటుందని చెబుతున్నారు. అయితే ఈ నాలుగు సీట్లను కూటమి పార్టీలు ఎలా పంచుకుంటాయనేదే ఇప్పుడు విస్తృత చర్చగా మారింది. కూటమిలో మూడు పార్టీలలో టీడీపీ, జనసేనకు క్షేత్రస్థాయిలో బలం, బలగం ఎక్కువని అంటున్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండటంతో రాష్ట్రంలో మిగిలిన పార్టీలకు సమానంగా అవకాశాలను ఆశిస్తోందని చెబుతున్నారు. ఇదే టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు ఉప ఎన్నికలు జరిగితే, ఈ రెండు సార్లు బీజేపీ ఒక్కోసీటును తీసుకుంది. అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు కావస్తున్నా కూటమిలోని కీలక పార్టీ జనసేనకు ఇప్పటివరకు రాజ్యసభ బెర్తు దక్కలేదు. దీంతో ఈ సారి జనసేన పార్టీకి కచ్చితంగా అవకాశం ఇవ్వాల్సివుంటుందని అంటున్నారు. ఇక మిగిలిన మూడు సీట్లను టీడీపీ తీసుకోవాలని పార్టీ నేతల నుంచి ఒత్తిడి వస్తోందని చెబుతున్నారు. అయితే ఈ విషయమై పార్టీ అధిష్టానం మాత్రం తన వైఖరిని బయటపడటం లేదు. కేంద్రంలో బీజేపీ సహకారం అవసరం అవడంతో ఆచితూచి స్పందించాలని హైకమాండ్ ఆలోచనగా ఉందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ అస్సలు వెనక్కి తగ్గేదేలే అన్నట్లు సంకేతాలు పంపుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. కూటమిలో ఇతర పార్టీలతో సంప్రదించకుండా తన పార్టీ అభ్యర్థిగా అన్నామలైని పోటీకి దించనున్నట్లు బీజేపీ వర్గాలలో జరుగుతున్న చర్చ కూటమి రాజకీయాల్లో హీట్ పుట్టిస్తోందని అంటున్నారు. తమిళనాడుకు చెందిన అన్నామలై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసేవారు. రాజకీయాలపై ఆసక్తితో ఐపీఎస్ ఉద్యోగాన్ని వదులుకున్న ఆయనకు న్యాయం చేయాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమిళనాడులో బీజేపీకి బలం లేకపోవడం, మిత్రపక్షం అన్నాడీఎంకేలో చీలిక రావడంతో భవిష్యత్తులోనూ ఆ రాష్ట్రం నుంచి అన్నామలైని రాజ్యసభకు పంపే అవకాశాలు కనిపించడం లేదని బీజేపీ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఏపీ నుంచి అన్నామలైకి అవకాశం ఇవ్వాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించిందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమ పరిస్థితి ఏంటని టీడీపీ నేతలు తర్జనభర్జన పడుతున్నారు. మొత్తానికి బీజేపీ వైఖరి ముఖ్యమంత్రి చంద్రబాబును, టీడీపీని ఇరుకున పడేసినట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు.




## 60 మంది ఉపాధి కూలీల పేరిట

# రూ.లక్షల దోపిడీకి కుట్ర...!

- మండపం ఊర చెరువులో పని చేయకుండానే హాజరు
- ఈ చెరువులో పనులు చేయడం లేదని ముందస్తు ప్రకటన
- నమ్మించి వంచించి రహస్యంగా మోసానికి తెర లేపారు
- మొదటి వారం 60 మంది కూలీల పేరిట నకిలీ మస్తర్లు
- రెండో వారంలోనూ శనివారం వరకూ హాజరు నమోదు
- నిలదీస్తే నమోదు కాని పొరపాటు సర్దుబాటుకని వివరణ
- స్థానిక "దేశం" నాయకుడి జేబు నింపేందుకే న్నాగం
- జనసేన నిలదీతతో పారని అధికారుల 50 : 50 పథకం




View daily attendance taken at the work site (Through NMMS App)

State: ANDHRA PRADESH District: KAKINADA Block: Sankhavaram Panchayat: MANDAPAM

Work Code : 0204009014/WH/9999005261455 Msr No. : 2229
Work Name : Comprehensive Restoration of Minor Irrigation Tank at Vura Tank


Group Photo 1
Uploaded Group Photo-1
Timestamp for Photo-1
Taken : 14 May 2026 06:29:06:000
Uploaded : 14 May 2026 10:40:43:000
Geo Co-ordinates: 17.3164265,82.3950365
Taken by: Nakka Vyaparayya
Designation: Mate

Group Photo 2
Uploaded Group Photo-2
Timestamp for Photo-2
Taken : 14 May 2026 10:41:39:000
Uploaded : 14 May 2026 10:41:40:250
Geo Co-ordinates: 17.3164063,82.3950903

| S.No | Job Card No | Worker Name(Gender) | Attendance Date | Present/Absent |
|---|---|---|---|---|
| 1 | AP-04-009-014-031/31113 | Nakka Durga (F) | 14 May 2026 | Present |
| 2 | AP-04-009-014-031/31195 | Nakka Apparao (M) | 14 May 2026 | Present |
| 3 | AP-04-009-014-031/31198 | Nakka Suresh Kumar (M) | 14 May 2026 | Present |
| 4 | AP-04-009-014-031/31248 | Egala Mahalaxmi (M) | 14 May 2026 | Present |

Last Updated On : 15/05/2026

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో కూలి పనులు లేక కుటుంబం పూట గడవక పొట్ట పోషణ కోసం దూరప్రాంతాలకు కూలీలు వలస పోవడాన్ని నిరోధించి, ఇటువంటి బడుగు జీవుల కుటుంబాలకు సంవత్సరంలో కనీసం 100 రోజుల పాటైనా పనులను చెప్పి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకం రాష్ట్రంలో అధికార పార్టీల చోటా, మోటా నాయకుల జేబులు నింపే దళారీలుగా ఉపాధిహామీ పథకం సిబ్బంది మారి పోయారు. గ్రామంలో అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ, వారికి ఇష్టులైన కూలీలకు మాత్రమే పనులు చెబుతూ, అసలు పనులు చేయకుండానే చేసినట్టు నకిలీ మస్తర్లు వేసి, ఆ సొమ్ములను సదరు నాయకుల జేబులను నింపుతూ నిర్లజ్జగా బానిసల అవతారం ఎత్తారు. దీనికి చక్కని ఉదాహరణ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం మండపంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం అవినీతి భాగోతం. మండపంలో సోమవారం ఏప్రిల్ 27 నుంచి ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ మే నెలలో ఊర చెరువు (వర్క్ ఐడి 0204009014/ డబ్ల్యు. హెచ్. 99990052 61455), రాజన్నదొర చెరువు (వర్క్ ఐడి 62822), కట్టు గట్టు చెరువు (వర్క్ ఐడి 61490) ల్లో ప్రస్తుతం కాంప్రహెన్సివ్ రెస్టోరేషన్ ఆఫ్ మైనర్ ఇరిగేషన్ టేంక్స్ పథకంలో ఉపాధి హామీ పనులను చేస్తున్నట్టు అంతర్జాల దస్త్రాలు వెల్లడిస్తున్నాయి. కానీ నిజానికి రాజన్నదొర చెరువు, కట్టు గట్టు.. ఈ రెండు చెరువుల్లోనే పనులు జరుగు తున్నాయి. ఇక మూడోది ఊర చెరువులో అస్సలు పనులు జరగడం లేదు. ఇంకా ప్రారంభం కాలేదు. మూడు చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికీ ఊర చెరువులో పనులు చేయమని గ్రామంలో మూడు వారాల క్రితమే సీనియర్ మేట్ నక్కా వ్యాపారయ్య ప్రకటించేసాడు. దీంతో మూడింట రెండు చెరువుల్లోనైనా పని దొరికింది కదా... ఊర చెరువు పనొచ్చాక చూసుకుందాంలే నని ఆ రెండు చెరువుల్లోనే పని చేసుకుంటూ సంతృప్తి పడుతున్నారు. సరిగ్గా ఇదే అదనులో... కూలీల ఆదమరపు వెనుక పెద్ద అవినీతి కుట్రకు తెరతీశారు. అందుకు నమ్మకమైన 60 మంది నకిలీ కూలీలను ఎంపిక చేసుకున్నారు. ఊర చెరువులో పనులు చేయకుండానే చేసినట్టు నకిలీ మస్తర్లు వేసి నకిలీ కూలీల పేరిట విడుదలైన సొమ్మును 50:50 (సగం మీకు, సగం మాకు) పద్ధతిన పంచుకునేందుకు వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విధంగా లక్షలాది రూపాయలను స్వాహా చేసేందుకు గ్రామంపై ఆధిపత్యం చెలాయిస్తున్న"దేశం" పార్టీ నాయకుడు, ఉపాధి హామీ పథకం క్షేత్ర, కార్యాలయం సిబ్బంది పన్నాగం పన్నారు. అనుకున్నది అనుకున్నట్లుగా అమలు జరిపేస్తూ ఉన్నారు. మిగతా రెండు చెరువుల కూలీలు, దారిన పోయే వారి ఫోటోలను తీసి వాటిని ఊర చెరువు కూలీల ఖాతాకు జత చేసేస్తున్నారు. మొదటి వారంగా మే నెలలో సోమవారం 4 తేదీ నుంచి శనివారం వరకూ పనులను చేసినట్లు నకిలీ కూలీల పేరున మస్తర్లు వేసి ఛాయా చిత్రాలను అంతర్జాలంలో నమోదు చేసారు. ఈ వారానికి వీరికి చెల్లింపులు చేయాల్సిన కూలి సొమ్ముల మొత్తాలను నమోదుచేసి పేమెంట్ ఆర్డర్లను కంప్యూటర్లో అప్ లోడ్ చేశారు. రెండో వారంగా సోమవారం మే 11 తేదీ నుంచి 16 తేదీ శనివారం వరకూ కూడా నకిలీ మస్తర్లను నమోదు చేశారు. ఇలా 60 మంది కూలీలకు రోజుకు రూ. 200 ల చొప్పున చూసుకున్నా వారానికి రూ.72,000 అవుతోంది. రెండు వారాలకూ కలిపి రూ. 1,44,000 అవుతోంది. రెండో వారం శుక్రవారం వరకూ అంతా


Job card
MAHATMA GANDHI NATIONAL RURAL EMPLOYMENT GUARANTEE ACT

Job card No.: AP-04-009-014-031/31248
Family Id: 31248
Name of Head of Household: Egala Mahalaxmi
Name of Father/Husband: Egala Mahalaxmi
Category: OTH
Date of Registration: 5/28/2025
Address:
Villages: MANDAPAM
Panchayat: MANDAPAM
Block: Sankhavaram
District: KAKINADA(ANDHRA PRADESH)
Whether BPL Family: NO Family Id: 31248
Epic No.:

Details of the Applicants of the household willing

| S.No | Name of Applicant | Gender | Age | Bank/Postoffice | Worker Photo |
|---|---|---|---|---|---|
| 1 | Egala Mahalaxmi | Male | 35 | STATE BANK OF INDIA | Worker Photograph |
| 2 | Egala Durga | Female | 30 | STATE BANK OF INDIA | Worker Photograph |

Signature/Thumb impression of Applicant
Seal & Signature of Registering Authority

Select Financial Year: 2022-2026

Requested Period of Employment

| S.No | Demand Id | Name of Applicant | Month & Date from which employment requested | No of Days |
|---|---|---|---|---|
| 1 | 1202171 | Egala Durga | 04/05/2026~~09/05/2026~~6 | 6 |
| 2 | 1202170 | Egala Mahalaxmi | 04/05/2026~~09/05/2026~~6 | 6 |
| 3 | 1472276 | Egala Durga | 11/05/2026~~16/05/2026~~6 | 6 |
| 4 | 1468910 | Egala Mahalaxmi | 11/05/2026~~16/05/2026~~6 | 6 |

Period and Work on which Employment Offered

| S.No | Demand Id | Name of Applicant | Month & Date from which employment requested | No of Days | Work Name |
|---|---|---|---|---|---|
| 1 | 1202171 | Egala Durga | 04/05/2026~~09/05/2026~~66 | | Comprehensive Restoration of Minor Irrigation Tank at Vura Tank (0204009014/WH/9999005261455) |
| 2 | 1202170 | Egala Mahalaxmi | 04/05/2026~~09/05/2026~~66 | | Comprehensive Restoration of Minor Irrigation Tank at Vura Tank (0204009014/WH/9999005261455) |
| 3 | 1472276 | Egala Durga | 11/05/2026~~16/05/2026~~66 | | Comprehensive Restoration of Minor Irrigation Tank at Vura Tank (0204009014/WH/9999005261455) |
| 4 | 1468910 | Egala Mahalaxmi | 11/05/2026~~16/05/2026~~66 | | Comprehensive Restoration of Minor Irrigation Tank at Vura Tank (0204009014/WH/9999005261455) |

Period and Work on which Employment Given

| S.No | Name of Applicant | Month & Date from which employment requested | No of Days | Work Name | MSR No. | Total Amount of Work Done | Payment Due |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Egala Durga | 04/05/2026 | 4 | Comprehensive Restoration of Minor Irrigation Tank at Vura Tank (0204009014/WH/9999005261455) | 1949 | 1120.04 | 0 |
| | Sub Total FY 2627 | | 4 | | | 1120.04 | 0 |

సవ్యంగానే జరిగింది. శనివారం ఉదయం స్థానిక జనసేన పార్టీ నాయకులు, పోలం బ్రదర్స్ పోలం వెంకటరత్నం, పోలం విష్ణుమూర్తి (పద్మ) ఈ దోపిడీని మీడియా, గ్రామ ప్రజల సమక్షంలో బట్టబయలు చేసేశారు. అంతే కాకుండా ఊర చెరువుకు చేరుకున్న ఉపాధి హామీ పథకం ఏపిఓ. ఎన్.వి.వివిఎస్. శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ (టిఏ) వింజమళ్ళ సతీష్ ను నిలదీశారు. ఎంపీడీవో యు.నాగేంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో ఊర చెరువులో రెండు వారాల మస్తర్లను కంప్యూటర్ నుంచి తొలగించి, కూలీలకు నగదు బదిలీ కాకుండా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానిక "దేశం" నాయకుడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పన్నాగం బెడిసి కొట్టినట్లైంది.

'ఉపాధి' వేటలో

## బతుకులు సమాధి

### మంత్రి సుభాష్ రూ.2 లక్షల సాయం

**మసీదుసెంటర్(కాకినాడ), విశ్వం వాయిస్ న్యూస్ :** వారంతా నిరుపేదలు. శనివారం తెల్లవారుజామునే లేచి ఉపాధిహామీ పనులకు వెళ్లారు. మస్తరు వేయించుకోవడానికి కాకినాడ గ్రామీణం కొవ్వూరు వంతెన సమీపంలో రోడ్డు పక్కన నిలుచున్నారు. ఇంతలో టిప్పర్ మృత్యువు రూపంలో వారిపైకి దూసుకొచ్చింది. ఏం జరిగిందో తెలిసే లోపు నలుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఇద్దరు తీవ్రగాయాలతో మృత్యువుతో పోరాడుతున్నారు. వీరంతా కాకినాడ గ్రామీణం చీడిగ వాసులే కావడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

**మిన్నంటిన రోదనలు**

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అక్కడ మృతుల కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పంతం సందీప్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

**ఆ పిల్లలకు దిక్కెవరు?**

కాదా చిట్టెమ్మ భర్త చనిపోయారు. ఈమెకు ఇద్దరు అమ్మాయిలు. పెద్దకుమార్తెకు వివాహం చేశారు. చిన్నమ్మాయికి ఇంకా పెళ్లి కాలేదు. కూలి పనులకు వెళ్లి చిట్టెమ్మ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇప్పుడు కుటుంబానికి ఆధారంగా ఉన్న ఆమె మృతిచెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

**పనికి వెళ్లి ప్రాణం కోల్పోయి..**

చెల్లూరి అన్నవరం కొన్నేళ్ల కిందట భర్తతో విడిపోయి వేరుగా ఉంటున్నారు. వీరికి ఒక అమ్మాయి సంతానం. ఆమెకు వివాహమైంది. అన్నవరం కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఉపాధి పనులకెళ్లి ప్రాణం కోల్పోయిందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**15 రోజుల నుంచే...**

చీడిగ గ్రామానికి చెందిన పాలిక కృష్ణవేణి భర్తకు ప్రమాదం జరగడంతో గేదెల పెంపకం, పాల వ్యాపారం మానేసి, ఓ షాపులో పనిచేస్తున్నారు. కుమార్తె, కుమారుడు డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుతున్నారు. ఆర్థిక పరిస్థితులతో సత్యవతి 15 రోజుల నుంచే ఉపాధి పనులకు వెళుతున్నారు. ఇంతలోనే మృత్యువాత పడడం కుటుంబ సభ్యులను కలిచి వేస్తోంది.

**కుమార్తె ఇంటి వద్ద ఉండిపోయినా...**

వాసంశెట్టి సత్యవతి భర్త చనిపోయారు. చిన్నపాకలో నివాసం ఉంటున్నారు. కుమార్తె, కుమారుడు సంతానం. హైదరాబాద్‌లో ఉన్న కూతురు ఇంటికి వెళ్లి శుక్రవారమే ఆమె తిరిగి వచ్చారు. కుమార్తె వద్దే ఇంకోరోజు ఉంటే ప్రాణాలు కోల్పోయేది కాదని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

**మంత్రి సుభాష్ రూ.2 లక్షల సాయం**

శెట్టిబలిజ యాక్షన్ ఫోర్సు (ఎస్ఏఎఫ్), సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున రూ.2 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు మహిళలకు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్సు, ఒకరికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. ఎస్ఏఎఫ్ ప్రతినిధులు చొల్లంగి వేణుగోపాల్, గుత్తుల శ్రీనివాస్, కడలి శివ, కొండా వినాయక్ పరామర్శించారు.

# పవన్ వ్యాఖ్యల వెనక లోతైన వ్యూహం!



జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి పార్టీ ఆఫీసులో నిర్వహించిన ఉద్యమి ఆత్మీయ సమావేశంలో అనేక విషయాల మీద మాట్లాడారు. ఒక విధంగా ఆయన మరోసారి తన రాజకీయ జీవితాన్ని మొత్తం సింహావలోకనం చేసుకున్నారు. 2007 నుంచి మొదలుపెట్టి 2026 దాకా రెండు దశాబ్దాల తన రాజకీయం ఒడుదుడుకులు మద్దతు పొత్తులు ఒంటరి పోరు పదవుల విషయంలో తన ఆలోచనలు రాష్ట్రం మీద తన కమిట్ మెంట్ ఇలా అన్నీ చెప్పుకుంటూ వచ్చారు. అదే సమయంలో కూటమిలో ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. రాష్ట్రం కోసం ఆలోచించే తాను కార్యకర్తల కోసం ఆలోచించలేనా అని ఆయన వ్యాఖ్యానించారు. తనకు అన్నీ తెలుసు అని చెబుతూనే తాను సర్దుబాటు చేస్తాను మీ ఆత్మగౌరవం తగ్గించను అని చెప్పారు.


**అవతల వైపు నుంచి :** మన వైపు నుంచి నూరు శాతం మద్దతు ఇచ్చినపుడు అవతల వైపు నుంచి అంతే స్థాయిలో రావాలని ఆయన అనడం విశేషం. ఇది కూటమిలో జనసేన కార్యకర్తలకు ఊరట కలిగించే మాటగా ఉన్నా అధినాయకత్వం కూడా క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పరిణామాల మీద స్పందిస్తున్న తీరుగనూ భావించాల్సి ఉంటుందని అంటున్నారు. అంటే తాము రాష్ట్రం కోసం ఆలోచించి మద్దతు ఇచ్చామని కానీ అవతల పక్షం నుంచి తమకు ఆశించిన మద్దతు రాలేదన్నది జనసేనలో ఉందా అన్న చర్చ అయితే సాగుతోంది. 2024లో ఒంటరి పోరుకు బలం ఉందని అయినా రాష్ట్రమే ముఖ్యమని భావించామని పవన్ చెప్పడం కూడా ఇక్కడ మరో కీలకమైన పాయింట్ గా చూడాల్సి ఉంది.

**బలాన్ని చాటుకోవాలనే :** ఓవరాల్‌గా చూస్తే తమిళనాడులో విజయ్ పార్టీతో పోల్చవద్దు అని పవన్ చెబుతున్నా కూడా తన ప్రసంగం మొత్తంలో ఆ ప్రభావం చాలానే కనిపించింది అని విశ్లేషిస్తున్నారు అందుకే క్షేత్ర స్థాయిలో జనసేన బలపడాలి అన్నది కూడా పవన్ మార్క్ వ్యూహంగా ఉంది అని అంటున్నారు. క్యాడర్ విషయంలో తాను భరోసాగా ఉంటాను అని చెప్పడం పార్టీకే ఇక మీదట పూర్తి ప్రయారిటీ ఇస్తామని హామీ ఇవ్వడం వంటివి చూస్తే స్థానిక ఎన్నికల నుంచే జనసేన తన రాజకీయ వాటా కోసం గట్టిగానే కృషి చేస్తుందా అన్న చర్చ సాగుతోంది.

**కింగ్ మేకర్ కావాలన్నదే :** మరో వైపు చూస్తే జనసేన వచ్చే ఎన్నికల నాటికి ఏపీలో కింగ్ మేకర్ గా కావాలన్నది కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు పవన్ తాజాగా పార్టీ వేదిక మీద చేసిన వ్యాఖ్యలు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకుంటున్న తీరు స్థానిక సంస్థల ఎన్నికల మీద గురి పెడుతున్న విధానం, మీరే నాకు ముఖ్యం, ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీయను అంటూ క్యాడర్ లో నింపుతున్న ఉత్తేజం ఇవన్నీ వెరసి 2029 ఎన్నికల నాటికి జనసేన గట్టిగా బలం పుంజుకుని రాష్ట్ర రాజకీయాల్లో మరింతగా తన సత్తాను చాటేందుకు సమాయత్తం అవుతోంది అని విశ్లేషిస్తున్నారు. మొత్తానికి తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన సక్సెస్ ఏపీలో జనసేన మీద బాగానే ప్రభావం చూపిస్తోంది అని అంటున్నారు. రానున్న రోజులలో జనసేన దూకుడు కూడా పెరగనుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

ఉరి వేసుకుని

## నవవధువు ఆత్మహత్య





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళ్ల పారాణి ఆరకముందే నవవధువు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గోనేడ గ్రామానికి చెందిన సత్యంశెట్టి వెంకటలక్ష్మిని.. పెద్దాపురం మండలం మర్లవ గ్రామానికి చెందిన గాది కోటేశ్వరరావుకు ఇచ్చి ఏప్రిల్ 25వ తేదీన పెద్దలు వివాహం జరిపించారు. వివాహం జరిగి కనీసం నెల రోజులు కూడా గడవకముందే తమ కుమార్తెను కోటేశ్వరరావు వేధింపులకు గురిచేశాడని, అందుకే ఆమె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిర్లంపూడి ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# మండలంలో అక్రమార్కులకు కల్పతరువుగా జలధార జలహారతి

★ అనుమతులు గోరంత ★ తవ్వేది కొండంత ★ నిబంధనలకు తూట్లు ★ మొద్దు నిద్రలో ఇరిగేషన్





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జలధార-జలహారతి కార్యక్రమం కోరుకొండ మండలంలో అక్రమార్కులకు కల్పతరువుగా లక్షలాది రూపాయలు తెచ్చి పెడుతుందని పలువురు ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల రైతులు వాపోతున్నారు. మండలంలోని నిడిగట్ల గ్రామానికి చెందిన తల్లప్ప చెరువులో గత 20 రోజుల నుండి నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలతో సమయ భావం లేకుండా అక్రమార్కులు యదేచ్ఛగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ లేఔట్లకు తరలిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ చెరువులో పదివేల క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతులు తీసుకొని, పెద్ద ఎత్తున తవ్వకాలు సాగిస్తున్నారు. కోరుకొండ మండలంలో జలధార- జలహారతి కార్యక్రమం ద్వారా నీటి వనరుల సంరక్షణ మాట ఎలా ఉన్నా, అక్రమార్కులకు ఎన్డీఏ కూటమిలో కొద్దిమంది కార్యకర్తలకు లక్షలాది రూపాయలు తెచ్చిపెడుతుందని పలు గ్రామాల ప్రజలు, అధికార కూటమికి చెందిన నాయకులు బహిరంగంగా పోతున్నారు. ఇంత తతంగం జరుగుతున్న రెవెన్యూశాఖ పనితీరు తామరాకు మీద నీటి బొట్టుల ఉంటుందని, ఇక ఇరిగేషన్ అధికారులు గోరంత అనుమతులు ఇచ్చి, కొండంత ఎత్తున తవ్వకాలు జరుగుతున్న కానరాకపోవడం, అధికారులు ఉదాసీనత వెరసి, పలు అనుమానాలను బలపరుస్తుందని పలువురు ప్రజాప్రతినిధులు రైతులు అంటున్నారు. ఇక సమయభవం లేకుండా పది చక్రాల లారీలు దుమ్ము రేపుతూ, ప్రజల గుండెల్లో రేయింబవళ్లు రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. దీంతో వివిధ గ్రామాలలో ప్రజలు ప్రాణాలను అరి చేతిలో పెట్టుకొని, పనులు ముగించుకుంటున్నామంటున్నారు. రాత్రి వేళల్లో వాహనాలు పై పరిమితికి మించి మట్టిని తరలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు వ్యవస్థలు మొద్దు నిద్ర నటిస్తూ, అక్రమార్కులకు అండగా నిలుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలం నుండి అక్రమార్కులు మట్టిని నర్సరీలకు, బట్టీలకు, రియల్ ఎస్టేట్ లకు వాహనాల్లో పరిమితికి మించి తరలించడంతో వాహనాలలో మట్టి ఎవరిమీద పడుతుందో అని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొన్నిచోట్ల ఎటువంటి అనుమతులు లేకుండా పొలాలను లేఔట్ లుగా మారుస్తూ, మట్టి అక్రమార్కుల అండదండలతో సైట్ ఫీలింగ్ చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. జలధార జలహారతి కార్యక్రమాన్ని అక్రమార్కులు రైతుల ముసుగుతో పెద్ద ఎత్తున 10 టైర్ లారీలు, ట్రాక్టర్లతో రియల్ ఎస్టేట్ కు పెద్ద ఎత్తున తరలిస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. జలధార జలహారతి కార్యక్రమాల్లో సాగునీటి సంఘ సభ్యులు, అఖిలపక్ష నాయకులు, రైతులు, గ్రామస్తులకు తెలియజేయకుండానే ఏకపక్ష అనుమతులతో విచ్చలవిడి త్రవ్వకాలు జరుగుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నటిస్తున్న మొద్దు నిద్ర వీడి, చినుకులు పడక ముందే వివిధ చెరువుల్లో అనుమతులకు మించి తవ్విన తవ్వకాలను నమోదు చేసి, వారు వద్ద నుండి పెనాల్టీలతో అదనపు సొమ్ములు కట్టించుకోవాలని, పలువురు ఎన్డీఏ నాయకులు, రైతులు గ్రామస్తులు అంటున్నారు. మరి అధికారులు స్పందిస్తారో, ప్రజా ప్రతినిధులకు వత్తాసు పలుకుతూ కాన రాలేదంటారో వేచి చూద్దాం.



## తెదేపా కార్యాలయంలో ఘనంగా బొడ్డు జన్మదిన వేడుకలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున చేరుకుని బొడ్డు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోరుకొండ స్వయంభు శ్రీలక్ష్మి నరసింహస్వామికి బొడ్డు పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బూరుపూడి తెదేపా కార్యాలయంలో కేక్ కట్ చేసి, బొడ్డుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ నారా లోకేష్ కు బొడ్డు అనుంగ నాయకుడిగా ఉంటూ పార్టీలో అంచెలంచలాగా ఎదుగుతున్నారని, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తూ అన్ని వర్గాల ప్రజల ఆదరణతో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లకు తెదేపా మండల కన్వీనర్ దూది కాంతారావు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయగా,భోజనాలు బాగున్నాయంటూ దూదికి కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కన్వీనర్లు గంగిశెట్టి చంటిబాబు, కంటే నాగ కేశవరావు, దూది కాంతారావు, నూనె వెంకన్న, తనకాల నాగేశ్వరరావు,పుప్పాల వెంకటరత్నం, మార్ని రాము, మార్ని బుజ్జి, తెలగంశెట్టి శ్రీనివాస్, రొంగల శ్రీను, కొయ్యే సామ్యూల్,ముంద్రు గాంధీ,బుద్ధ బాపూజీ, కోర్పు రామకృష్ణ, పెనకటి గంగాధర్, తనకాల రామలింగేశ్వర రావు, పీతా శ్రీనుబాబు, కోర్పు రాజేష్, మాత ప్రభు, పలువురు తెదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బొడ్డు జన్మదినాన్ని పురస్కరించుకొని కామిశెట్టి మజ్జిగ పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి 51వ జన్మదిన వేడుకలు కోరుకొండ మండలంలో రాజానగరం నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బొడ్డు వెంకటరమణ చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ నాయకులు కామిశెట్టి దొరబాబు (మీసాల దొరబాబు) కోరుకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పాదచారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తమ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోధించేలా కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు ఆయనకు అందజేయాలన్నారు.

## ఆలయ పునః నిర్మాణానికి గన్ని విరాళం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక భాస్కర్ నగర్లోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి మందిరం పునః నిర్మాణానికి గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ విరాళం అందజేశారు. గతంలో భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గన్ని అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం కంబాలచెరువు సెంటర్లో ఉన్న వారి కార్యాలయంలో కమిటీ సభ్యులకు చెక్కును అందించారు.ఆలయ నిర్మాణం చక్కగా జరగాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విరివిగా చేయాలని గన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


## గీత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

- సంప్రదాయ వృత్తులను పరిరక్షిస్తూ గీత కార్మికుల జీవనోపాధికి కృషి
- ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించేందుకు చర్యలు
- రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు



**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గీత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా పైడిమాంబ యాత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్‌లో నిర్వహించిన గీత కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గీత కార్మికులు, సంఘ ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సత్తిబాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. ప్రమాదకర పరిస్థితుల్లో పని చేసే గీత కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో గీత కార్మికుల సమస్యలను తమ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. చెట్లెక్కే సమయంలో ప్రమాదవశాత్తు కిందపడే ఘటనలు తరచూ జరుగుతున్నాయని, అలాంటి సందర్భాల్లో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సత్తిబాబు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల్లో గాయపడిన వారికి, మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గీత కార్మికుల కోసం బీమా, ఆరోగ్య సహాయం, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని చెప్పారు. గీత కార్మికుల పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సంప్రదాయ వృత్తులను పరిరక్షిస్తూ గీత కార్మికుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో సిమ్మ అప్పారావు, కొలుసు శ్రీనివాసరావు, జే అప్పారావు, సిహెచ్ అప్పన్న,జి. ఎర్ని దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## గాడాల గంగాలమ్మను దర్శించుకున్న జక్కంపూడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గాడాల గ్రామదేవత మాతృశ్రీ గంగాలమ్మతల్లి జాతర మహోత్సవాలు అశేష భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా గంగాలమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు జక్కంపూడి రాజాకు తీర్థ ప్రసాదాలు అందజేసి, పూలమాలలు వేసి సాలువతో ఘనంగా సత్కరించారు. గంగాలమ్మ జాతర ముగింపును పురస్కరించుకొని భక్తుల సహాయ సహకారాలతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. జక్కంపూడి రాజా అన్న సమారాధనలో పాల్గొని, పలువురిని ఆప్యాయతగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు, జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు, ఆలయ కమిటీసభ్యులు కొండపల్లి శివశంకర్, కొండపల్లి స్వామి, కోడూరి వెంకన్న, కొండపల్లి నాగేశ్వరరావు, పోరాపు వీరబాబు, కోడూరి శ్రీను పలువురు వైకాపా నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన నేలటూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండలం, నేలటూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు వనుం గోపాలకృష్ణ, వనుం కిరణ్ కుమార్‌లు ఆ గ్రామ టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు రుద్రాక్షుల సోమేష్ ఆధ్వర్యంలో ఆదివారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో వైసీపీని వీడి తెలుగుదేశంపార్టీ లో చేరారు. వీరి ఇరువురికి ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వల్లూరి శ్రీనివాస్ చౌదరి, కడలి గోవిందరాజు, అల్లం శ్రీను, వాసా దుర్గారావు, రుద్రాక్షుల వెంకట



గణేష్, గెద్దాడ చిన్నబాబు, కుక్కల బాలశ్రీను, కుక్కల నాగరాజులు పాల్గొన్నారు.




### 945 డైమండ్స్, బ్లూ సఫైర్ నెక్లెస్‌తో

# మైండ్ బ్లోయింగ్ లుక్‌లో టాలీవుడ్ బ్యూటీ

సౌత్ ఇండియన్ సినిమా కీర్తి ప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయిలో రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే మన సినిమాలు, దర్శకులు గ్లోబల్ వేదికలపై సత్తా చాటుతుండగా, తాజాగా టాలీవుడ్, మోలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక స్టార్ కిడ్ ప్రతిష్టాత్మక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై మెరిసి అందరి దృష్టిని ఆకర్షించింది. తన అందచందాలతో, అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో అంతర్జాతీయ మీడియాను సైతం ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచింది. మలయాళం, తమిళంతో పాటు తెలుగులో పలు వైవిధ్యమైన సినిమాల్లో నటించి మెప్పించిన హోమ్లీ బ్యూటీ కల్యాణీ ప్రియదర్శన్?, కాన్స్ వేదికపై అడుగుపెట్టడం ఆమె కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ వేడుకలో ఆమె ధరించిన బ్లాక్ అండ్ పర్పుల్ కాంబినేషన్ అవుట్‌ఫిట్ మాత్రమే కాదు, ఆమె అలంకరించుకున్న నగల వైభవం కూడా నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంది.

**రెడ్ కార్పెట్‌పై రాయల్ లుక్..**

రెడ్ కార్పెట్ మీద కెమెరా కళ్లన్నీ ఆమె ధరించిన నగల వైపే తిరిగాయి. కళ్యాణ్ జ్యువెలర్స్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన నెక్లెస్ ఈమె లుక్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ నెక్లెస్ వెనుక భాగంలో ఒక శిల్పం లాంటి చైన్ పొడిగింపుతో ఉండి, ఆమె అవుట్‌ఫిట్‌కు మరింత రాయల్ లుక్‌ను తెచ్చింది. ఈ అద్భుతమైన నెక్లెస్‌ను 14 క్యారెట్ల వైట్ గోల్డ్‌తో తయారు చేశారు. ఇందులో 52 క్యారెట్ల పియర్ షేప్డ్ (అరటి పండు గింజ ఆకారం) బ్లూ శాఫైర్ (నీలమణి)ని అమర్చారు. అంతేకాదు, ఈ నెక్లెస్‌లో మొత్తం 945 నేచురల్, బ్రిలియంట్ మరియు ప్రిన్సెస్ కట్ డైమండ్స్ ఉపయోగించారు. వీటితో పాటు రెండు 15 క్యారెట్ల పింక్ మోర్గానైట్స్ ఈ హారంలో తళుకులీనాయి. ఆమె ధరించిన ఇయర్ రింగ్స్ కూడా శాఫైర్స్, మోర్గానైట్స్‌తో డిజైన్ చేయబడి ఎంతో గ్రాండ్‌గా కనిపించాయి. ఈ ఆభరణాలు ఆమె రెడ్ కార్పెట్ రూపానికి ఒక డ్రామాటిక్ మరియు పర్‌ఫెక్ట్ లుక్‌ను అందించాయి.

**మంత్రముగ్ధులను చేసిన ఫ్యాషన్ కాంబినేషన్**

ప్రతిష్టాత్మకమైన రెడ్ కార్పెట్‌పై ఆమె 'ఇర్త్' బ్రాండ్‌కు చెందిన బ్లాక్ అండ్ పర్పుల్ కలర్ స్ట్రాప్‌లెస్ గౌనులో హొయలు పోయింది. ఈ ఫిట్టెడ్ బోడిస్ గౌన్ ఆమె లుక్‌ను మరింత ఎలివేట్ చేయగా, అందులోని షిమ్మర్ ఎఫెక్ట్ ఆమె ధరించిన వజ్రాల నగల మెరుపుతో పోటీ పడింది. సౌత్ ఇండియన్ సినిమాకు గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై ప్రాతినిధ్యం వహిస్తూ ఎంతో ఎలిగెంట్ గా, గ్లామరస్‌గా ఆమె నడిచివచ్చిన తీరు ప్రశంసలు అందుకుంది. తన జుట్టును సాఫ్ట్ ఓపెన్ కర్ల్స్‌గా స్టైల్ చేసుకుని, సింపుల్ మేకప్ లుక్‌ను ఎంచుకుంది. ఐలైనర్ వాడకుండా ఐషాడో, బ్లష్, లిప్‌స్టిక్ వంటి వాటిని పింక్ షేడ్స్‌లోనే ఉంచేలా జాగ్రత్త పడింది. మేకప్ హెవీగా ఉండి దుస్తులు, నగల అందాన్ని దెబ్బతీయకూడదనే ఉద్దేశంతోనే ఆమె టీమ్ ఈ విధమైన సాఫ్ట్-గ్లామ్ లుక్‌ను ప్లాన్ చేసింది.



# స్టార్ హీరో సినిమాలో ఎన్టీఆర్ గెస్ట్ రోల్..

## ఊహించని పాత్రలో తారక్..!! అభిమానులకు పూనకాలే..



ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ డ్రాగన్ (ప్రచారంలో ఉన్న పేరు) చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో కన్నడ భామ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. సాధారణంగా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎప్పుడూ రకరకాల గాసిప్స్, క్రేజీ కాంబినేషన్ల గురించిన వార్తలు చక్కర్లు కొడుతూనే ఉంటాయి. తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో విపరీతమైన హల్‌చల్ సృష్టిస్తున్న ఒక వార్త నందమూరి, మాస్ మహారాజా అభిమానులను ఎంతగానో ఆకర్షిస్తోంది. మాస్ మహారాజా రవితేజ హీరోగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి'. ఇదివరకే ఈ మూవీపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన ఒక సంచలన గాసిప్ ఇప్పుడు టాలీవుడ్ 'గాసిప్ గ్యారేజ్'లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో అత్యంత కీలకమైన, దైవిక ప్రాధాన్యత కలిగిన అయ్యప్ప స్వామి పాత్రలో గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ గెస్ట్ రోల్‌లో కనిపించబోతున్నారనే ప్రచారం గట్టిగా సాగుతోంది.

అయితే దీనిపై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. కానీ ఫిల్మ్ వర్గాల్లో ఈ న్యూస్ మాత్రం హల్చల్ చేస్తుంది. ఇటీవలే విడుదలైన 'ఇరుముడి' ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. రవితేజ ఇందులో నల్లటి దుస్తులు ధరించి, మెడలో మాల వేసుకుని భక్తిభావంతో ఉన్న ఒక పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తుడిగా (స్వామి మాలధారిగా) కనిపిస్తున్నారు. ఒకవైపు భక్తి, మరోవైపు తండ్రి-కూతుళ్ల మధ్య సాగే ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమాను శివ నిర్వాణ మలుస్తున్నారు. కథ ప్రకారం చిత్రంలో ఒక ప్రత్యేక సన్నివేశ ంలో గానీ, లేదా క్లైమాక్స్ వైపు వెళ్లే క్రమంలో గానీ అయ్యప్ప స్వామి వారి దివ్య రూపం లేదా దైవికమైన ఎపిసోడ్ ఒకటి ఉంటుందని తెలుస్తోంది. ఈ పాత్ర కేవలం కొన్ని నిమిషాల పాటే ఉన్నప్పటికీ, సినిమా మొత్తాన్ని ఒక ఊపు ఊపేసేలా ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. ఈ పాత్రకు ఎవరైనా పెద్ద స్టార్ హీరో అయితేనే న్యాయం జరుగుతుందని భావించిన చిత్ర బృందం, జూనియర్ ఎన్టీఆర్ పేరును పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఎన్టీఆర్ గతంలో నిజ జీవితంలో కూడా పలుమార్లు అయ్యప్ప దీక్షను ఎంతో నిష్ఠతో తీసుకున్నారు. ఆయన గంభీరమైన వాయిస్, నటనలోని దైవిక తీక్షణత ఈ పాత్రకు నూటికి నూరు పాళ్ళు సరిపోతాయని దర్శకుడు భావిస్తున్నట్లు సమాచారం. రవితేజ , జూనియర్ ఎన్టీఆర్ మధ్య రియల్ లైఫ్‌లో ఎంతో మంచి స్నేహబంధం ఉంది. ఒకవేళ ఈ వార్త కనుక నిజమైతే, వీరిద్దరి కాంబినేషన్‌ను ఒకే స్క్రీన్‌పై చూడటం అభిమానులకు పూనకాలు తెప్పించే విషయమే అవుతుంది. ముఖ్యంగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థతో ఎన్టీఆర్‌కు ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఈ క్యామియో రోల్ నిజమయ్యే అవకాశాలు ఉన్నాయంటూ నెటిజన్లు లెక్కలు వేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్, 'అయ్యప్ప' పాత్రపై చిత్ర యూనిట్ గానీ, లేదా జూనియర్ ఎన్టీఆర్ టీమ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇది కేవలం చర్చల దశలోనే ఉందా లేదా కేవలం పుకారు మాత్రమేనా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ విశ్వరూపం..

## సరికొత్త చరిత్ర సృష్టించిన రన్ మెషీన్..!




ఐపీఎల్ చరిత్రలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న కీలక పోరులో కోహ్లీ కేవలం పరుగుల వరద పారించడమే కాకుండా, ఎవరికీ సాధ్యం కాని రీతిలో పలు అద్భుతమైన రికార్డులను తన పేరిట లిఖించుకుని క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు. ధర్మశాలలోని మైదానంలో పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ పరుగుల వేట చూస్తే అభిమానుల గుండెలు ఉప్పొంగాల్సిందే. ప్రతి ఏడాది సరికొత్త రికార్డులతో అలరించే కోహ్లీ, ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగి చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచిపోయే మైలురాళ్లను అందుకున్నాడు.

**ఓపెనర్‌గా 5,500 పరుగులు.. ఒకే జట్టు తరపున సరికొత్త రికార్డు..!**

ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు విరాట్ కోహ్లీ ఓపెనర్‌గా ఒకే ఫ్రాంచైజీ తరపున అత్యధిక పరుగులు చేసిన రికార్డుకు కేవలం 7 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభించిన కాసేపటికే ఆ మైలురాయిని దాటి, ఐపీఎల్ చరిత్రలోనే ఒకే జట్టుకు ఓపెనర్‌గా ఉంటూ 5,500 పరుగులు పూర్తి చేసిన మొట్టమొదటి బ్యాటర్‌గా కోహ్లీ అవతరించాడు. గతంలో శిఖర్ ధావన్, డేవిడ్ వార్నర్ వంటి ఆటగాళ్లు ఓపెనర్లుగా ఈ మార్కును దాటినప్పటికీ, వారు వేర్వేరు జట్ల తరపున ఆడారు. కానీ కోహ్లీ మొదటి నుంచి బెంగళూరు జట్టుకే ఆడుతూ ఈ ఘనత సాధించడం విశేషం.

**పంజాబ్‌పై పరుగుల ప్రవాహం..**

కోహ్లీకి పంజాబ్ జట్టు అంటే ఎంత ఇష్టమో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఒకే ప్రత్యర్థి జట్టుపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీ నిలిచాడు. గతంలో చెన్నై సూపర్ కింగ్స్‌పై తను నెలకొల్పిన రికార్డును తనే అధిగమించి, ఇప్పుడు పంజాబ్ కింగ్స్‌పై ఏకంగా 1,175 పరుగులతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్ వంటి దిగ్గజాలు కూడా ఈ జాబితాలో కోహ్లీ కంటే వెనుకబడి ఉన్నారు.

**9వ సారి 500 ప్లస్ పరుగులు..**

కోహ్లీ స్థిరత్వానికి ఈ రికార్డే నిదర్శనం. ప్రస్తుత సీజన్‌లోనూ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, ఐపీఎల్ కెరీర్‌లో 9వ సారి ఒకే సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఘనతను సొంతం చేసుకున్నాడు. టోర్నీ చరిత్రలో మరే బ్యాటర్ కూడా ఇన్ని సీజన్లలో ఈ మార్కును అందుకోలేదు. వార్నర్, కేఎల్ రాహుల్ చెరో 7 సీజన్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా, వరుసగా నాలుగు సీజన్లలో (2023 నుండి 2026 వరకు) 500కు పైగా పరుగులు చేసి తన ఫామ్ ఎప్పటికీ తగ్గదని నిరూపించాడు.

**మైదానంలో బౌలర్లకు చుక్కలు..**

టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మొదట బౌలింగ్ ఎంచుకోగా, బెంగళూరుకు కోహ్లీ మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. యువ ఓపెనర్ జాకబ్ బెథెల్ త్వరగానే అవుట్ అయినప్పటికీ, కోహ్లీ మాత్రం పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. దేవదత్ పడిక్కల్ వేగంగా 45 పరుగులు చేసి నిష్క్రమించగా, కోహ్లీ మైదానం నలుమూలలా క్లాసిక్ షాట్లతో అలరిస్తూ క్రీజులో అజేయంగా నిలిచాడు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే 5 సార్లు యాభైకి పైగా పరుగులు చేసి జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. వయసు పెరుగుతున్నా పరుగుల ఆకలి మాత్రం తగ్గలేదని విరాట్ కోహ్లీ మరోసారి నిరూపించాడు. ఒకే ఇన్నింగ్స్‌లో ఇన్ని రికార్డులను బద్దలు కొట్టడం కేవలం కోహ్లీకి మాత్రమే సాధ్యమని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో పండగ చేసుకుంటున్నారు. ఈ రన్ మెషీన్ ఫామ్ ఇలాగే కొనసాగితే బెంగళూరు జట్టుకు తిరుగుండదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

### ఆ 2 జట్ల ఫ్యూచర్ డిసైడ్ చేసే 2 హైఓల్టేజ్ మ్యాచ్‌లు..

# ఓడితే ప్లే ఆఫ్స్ నుంచి ఔట్..?




ఈ సూపర్ సండే రోజున జరిగే డబుల్ హెడర్ మ్యాచ్‌లు ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్స్ చిత్రపటాన్ని మార్చనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌ల ఫలితాల ఆధారంగా ఏ జట్లు ముందడుగు వేస్తాయి, ఏ జట్లు వెనకబడతాయి అనే అంశంపై క్రికెట్ అభిమానులకు ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగింపునకు చేరుకోవడంతో ప్రతి మ్యాచ్ ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటివరకు 60 మ్యాచ్‌లు విజయవంతంగా పూర్తి కాగా, ప్లే ఆఫ్స్ రేసులో నిలవడమే లక్ష్యంగా జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఆదివారం (సూపర్ సండే) అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వడానికి సిద్ధమైంది. నేడు జరిగే రెండు కీలక మ్యాచ్‌లను ఓసారి చూద్దాం..

**పంజాబ్ కింగ్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు..**

మధ్యాహ్నం జరిగే మొదటి పోరులో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో దూసుకుపోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పరాజయాల భారంతో సతమతమవుతున్న పంజాబ్ కింగ్స్ జట్టుతో తలపడనుంది. ధర్మశాల వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ ఇరు జట్లకు చావో రేవో లాంటిదే.

**ఆర్సీబీ సమీకరణం:** ప్రస్తుతం 16 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా ఉన్న బెంగళూరు, ఈ మ్యాచ్‌లో గెలిస్తే అధికారికంగా ప్లే ఆఫ్స్ చేరిన మొదటి జట్టుగా నిలుస్తుంది. ఒకవేళ ఇక్కడ ఓడినా, తదుపరి మ్యాచ్‌లో గెలిచి ముందడుగు వేసే అవకాశం ఉంది.

**పంజాబ్ పరిస్థితి:** వరుసగా 5 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో నాలుగో స్థానానికి పడిపోయింది. ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే పంజాబ్ మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఖచ్చితంగా గెలవాల్సిందే. ఈరోజు ఓడిపోతే మాత్రం టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించినట్లే.

టాస్: టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో రాయల్ ఛాలెంజరస్ బెంగళూరు జట్లు బ్యాటింగ్ చేయనుంది.

**ఇరు జట్లు..**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేయింగ్: జాకబ్ బెథెల్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, వెంకటేష్ అయ్యర్, జితేష్ శర్మ(కెప్టెన్/కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, క్రునాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, సుయాష్ శర్మ.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇంపాక్ట్ ప్లేయర్లు: రసిఖ్ సలాం దార్, జోర్డాన్ కాక్స్, అభినందన్ సింగ్, స్వప్నిల్ సింగ్, కనిష్క్ చౌహాన్.

పంజాబ్ కింగ్స్ ప్లేయింగ్ : ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్(కీపర్), కూపర్ కొన్నోలీ, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), సూర్యాంశ్ షెడ్గే, శశాంక్ సింగ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, లాకీ ఫెర్గూసన్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com